మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 18-10-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 109 Issue: 109

18 అక్టోబర్ 2025 - శనివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు ఆశ్వయుజ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:13 సూర్యాస్తమయం - సా. 5:48 తిథిః ద్వాదశి మ. 12:21 వరకు తరువాత త్రయోదశి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం పూర్వ ఫల్గుని(పుబ్బ) మ. 3:39 వరకు తరువాత ఉత్తర ఫల్గుని(ఉత్తర) యోగం బ్రహ్మ రా. 1:39o వరకు కరణం తైతుల మ. 12:21 వరకు గరజ రా. 1:04o వరకు వర్జ్యం రా. 11:31 నుండి రా. 1:15 వరకు దుర్ముహూర్తం ఉ. 7:46 నుండి ఉ. 8:32 వరకు రాహుకాలం ఉ. 9:07 నుండి ఉ. 10:34 వరకు యమగండం మ. 1:28 నుండి మ. 2:55 వరకు గుళికాకాలం ఉ. 6:13 నుండి ఉ. 7:40 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:37 నుండి తె. 5:25 వరకు అమృత ఘడియలు ఉ. 8:49 నుండి ఉ. 10:32 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:38 నుండి మ. 12:24 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial

www.evarthalu.com



## కాంగ్రెస్ కోసం ఆస్తులు అమ్ముకున్నా

### అయినా పార్టీ నన్ను మోసం చేసింది

**ఇతర పార్టీల నుంచి వచ్చినోళ్లకు పెద్దపీట.. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి**

నల్లగొండ, అక్టోబర్ 17 (ఈవార్తలు): కాంగ్రెస్ పార్టీలో మంత్రి పదవుల వ్యవహారం మరోసారి కలకలం రేపింది. తనకు మంత్రి పదవి దక్కకపోవడంపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సొంత పార్టీయే తనను దారుణంగా మోసం చేసిందంటూ ఆయన సంచలన ఆరోపణలు చేశారు. 'కాంగ్రెస్ పార్టీని కాపాడటం కోసం నేను నా సొంత ఆస్తులు అమ్ముకున్నాను. అయినా పార్టీ నన్ను మోసం తరువాయి 2 వ పేజీలో...



## నేనూ సీఎం అభ్యర్థినే

### రెండు సార్లు గెలిస్తే రేసులో ఉంటా

**మంత్రుల నియోజకవర్గాలనే ఎక్కువ నిధులు.. ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అసహనం**

జడ్చర్ల, అక్టోబర్ 17 (ఈవార్తలు): మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. నేను కూడా సీఎం అభ్యర్థిని అవుతా అని ఆయన అన్నారు. డీసీసీ అధ్యక్షుడి ఎంపిక సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఈ కామెంట్స్ చేశారు. మంత్రుల జిల్లాలు, నియోజకవర్గాలకు ఎక్కువ నిధులు వెళ్తున్నాయని ఆయన చెప్పారు. మమ్మల్ని ఎమ్మెల్యేలుగా గెలిపిస్తేనే కదా మినిస్టర్స్, సీఎం అయ్యేది అని అన్నారు. మీరు బోరు, డ్రైనేజ్ ఇతర పనులు అడుగుతుంటే మిమ్మల్ని చూసి నవ్వుకుంటున్నాం తప్ప.. ఏమీ చేయలేకపోతున్నాం అని అనిరుధ్ రెడ్డి అన్నారు. జడ్చర్ల అభివృద్ధి కోసం ఎంతవరకైనా వెళ్తానని అనిరుధ్ రెడ్డి తేల్చి చెప్పారు. ఇంకో రెండు సార్లు నన్ను ఎమ్మెల్యేగా గెలిపించండి నేను కూడా సీఎం అభ్యర్థి అవుతా అంటూ హాట్ కామెంట్స్ తరువాయి 2 వ పేజీలో...

## రాహుల్ గాంధీ.. మీకంత సీన్ లేదు!

**అమెరికా సింగర్ మేరీ మిల్‌బెన్**



న్యూయార్క్: అమెరికా సింగర్ మేరీ మిల్‌బెన్ ప్రధాని మోదీకి మద్దతుగా రాహుల్ గాంధీపై విమర్శలు గుప్పించారు. దేశ ప్రధాని అయ్యే లక్షణం రాహుల్‌లో లేదన్నారు. మళ్లీ 'ఐ హేట్ ఇండియా టూర్' చేసుకుంటే మంచిదని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. భారత ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. ప్రధాని మోదీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు భయపడుతున్నారంటూ సోషల్ మీడియాలో -2 వ పేజీలో...

# బంద్ సరే..

"బంద్‌కు అన్ని రాజకీయ పార్టీల మద్దతు




## రిజర్వేషన్లేవి?

### మేం మద్దతు అంటే మేం మద్దతు అని ప్రకటన

**నిరసనలు, ధర్నాలకే ఉద్యమం పరిమితమా?.. ఢిల్లీ వేదికగా ఒత్తిడి తేవాలంటున్న బీసీ మేధావులు**

తెలంగాణలో బీసీ సంఘాలు శనివారం రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ బంద్ జరుగుతోంది. హైకోర్టు ఇటీవల జారీ చేసిన స్టే ఆర్డర్‌కు వ్యతిరేకంగా ఈ ఆందోళన చేపట్టారు. బీసీలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని సంఘాలు ప్రకటించాయి. ఈ బంద్‌కు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ సహా పలు పార్టీలు మద్దతు తెలిపాయి.

హైదరాబాద్, అక్టోబర్ 17 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు జారీ చేసిన జీవోపై హైకోర్టు అక్టోబర్ 9న స్టే విధించింది. దీనికి వ్యతిరేకంగా బీసీ సంఘాలు బంద్‌కు పిలుపునిచ్చాయి. బీసీలు ఇప్పటికీ సామాజిక వివక్షకు గురవుతున్నారని, వారికి సమాన హక్కులు, గౌరవం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. కోర్టులు -2 వ పేజీలో...



## 19న జనవరి ఆర్జిత సేవా టికెట్లు

తిరుమల, అక్టోబర్ 17 (ఈవార్తలు): భక్తుల సౌకర్యార్థం వచ్చే ఏడాది జనవరి నెలకు సంబంధించిన శ్రీవారి ఆర్జిత సేవల కోటా టికెట్లు, అంగ ప్రదక్షిణ టోకెన్లను ఈ నెల 19వ తేదీ ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం అక్టోబర్ 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందినవారు అక్టోబర్ 21 నుంచి 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. కల్యాణోత్సవం, -2 వ పేజీలో...



### లడ్డూ ధరలు పెంచడం లేదు 2

స్పష్టం చేసిన టీటీడీ



### బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.13,277 |
| వెండి (గ్రాము): | రూ.203 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,820 |

## రండి.. కలిసిపోదాం

### లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేత ఆశన్న

**మిగతావారూ లొంగిపోవాలని హితవు.. మనల్ని మనం కాపాడుకోవాలని సూచన**

మావోయిస్టు అగ్రనేత, పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న అలియాస్ రూపేష్ పోలీసుల ముందు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో ఆశన్న సహా 208 మంది మావోయిస్టులు ఉన్నారు.



రాయ్‌పూర్: వారిలో 110 మంది మహిళలు, 98 మంది పురుషులు ఉన్నారు. 153 ఆయుధాలు అప్పగించగా.. వీటిల్లో 19 ఏకే-47 రైఫిళ్లు, 17 ఎస్ఎల్ఆర్ రైఫిళ్లు, 23 ఇన్సాస్‌లు, 1 ఇన్సాస్ ఎల్ఎంజీ, 303 రైఫిళ్లు, 11 బీజీఎల్, నాలుగు కార్బైన్‌లు, 41 బోర్ షాట్‌గన్‌లు, పిస్తోళ్లు ఉన్నాయి. ఈ లొంగుబాటుపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ మాట్లాడారు. 'ఇది ఛత్తీస్‌గఢ్‌కే కాదు దేశం మొత్తానికి చరిత్రాత్మకమైన రోజు. హింసను తరువాయి 2 వ పేజీలో...



## స్థానిక ఎన్నికలు ఇంకెప్పుడు?

**సర్కారు, ఈసీకి హైకోర్టు ప్రశ్నలు.. ప్రభుత్వం నుంచి స్పందన రావాలి: ఈసీ**

**3 వారాలయ్యాక చెప్తాం: ప్రభుత్వం.. 2 వారాల గడువిచ్చిన హైకోర్టు ధర్మాసనం**

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు మరోసారి హైకోర్టు ముందుకు వచ్చాయి. ఎన్నికల నిర్వహణలో ఆలస్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నించిన హైకోర్టు, రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఈసీ)లపై కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ ఎన్నికలపై సురేందర్ అనే న్యాయవాది హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై సీజే ధర్మాసనం విచారణ జరిపింది. సురేందర్ దాఖలు చేసిన పిటిషన్‌లో, స్థానిక సంస్థల ఎన్నికలకు రీ నోటిఫికేషన్ జారీ చేసి వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కోరారు.

హైదరాబాద్, అక్టోబర్ 17 (ఈవార్తలు): గతంలోనే హైకోర్టు పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు జరపాలని ఆదేశించినప్పటికీ, ఇప్పటివరకు చర్యలు చేపట్టలేదని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, ఈసీని ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో స్పష్టంగా చెప్పాలని హైకోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు కూడా ఎన్నికలు నిర్వహించాల్సిందేనని సూచించిన విషయాన్ని గుర్తుచేస్తూ, ఈసీ స్పందన కోరింది. విచారణలో రాష్ట్ర ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది విద్యాసాగర్ మాట్లాడుతూ, బీసీ రిజర్వేషన్ల అంశంపై ఇప్పటికే ప్రభుత్వానికి లేఖ రాసినట్లు కోర్టుకు తెలిపారు. ప్రభుత్వం తరువాయి 2 వ పేజీలో...

### విశ్వవాణి



ఒత్తిడి ఎంత ప్రమాదకరం అంటే.. దాని ప్రభావం తరతరాలపై పడుతుందట. శుక్ర కణాలు తండ్రి ఒత్తిడికి సంబంధించిన జన్యువులను బిడ్డలోకి ప్రవేశింపజేస్తాయట. అలా.. ఆ ప్రభావం తర్వాతి తరాలపైనా పడుతుందని తాజా అధ్యయనం వెల్లడించింది.



## కొత్తగా 108 పీజీ మెడికల్ సీట్లు

హైదరాబాద్/న్యూఢిల్లీ: నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) 2025-26 విద్యా సంవత్సరానికి తెలంగాణలోని పలు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో కొత్తగా పీజీ సీట్లను మంజూరు చేసింది. రాష్ట్రంలోని 29 విభాగాల్లో మొత్తం 108 సీట్లను ఆమోదించింది. ఈ సీట్ల ఆమోదంతో తెలంగాణలో తరువాయి 2 వ పేజీలో...

# భారత్ తగ్గదు




### ఉగ్రదాడులపై మౌనంగా ఉండం

**ప్రపంచమంతా యుద్ధంపై చర్చ.. భారత్ మాత్రం అభివృద్ధిపై ఫోకస్**

**దేశ వృద్ధిని ఎవరూ అడ్డుకోలేరు.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ వెల్లడి**

న్యూఢిల్లీ: ఎన్ని అవరోధాలు ఎదురైనా భారత్ వృద్ధిని ఎవ్వరూ ఆపలేరని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రపంచంలో ఐదు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటి అని.. ద్రవ్యోల్బణం రేటు 2శాతానికి తక్కువగా, జీడీపీ వృద్ధి 7శాతానికి పైగా ఉందన్నారు. ఓ ఆంగ్లచానల్ నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ఉగ్రదాడులపై భారత్ మౌనంగా ఉండటం లేదన్నారు. గగనతల, సర్జికల్ స్ట్రైక్స్, ఆపరేషన్ సిందూర్ ద్వారా దీటుగా బదులిస్తోందని గుర్తు చేశారు. 'ప్రపంచమంతా యుద్ధాలపై చర్చలు పెడుతుంటే.. భారత్ మాత్రం వేగంగా అభివృద్ధి చెందుతూ విమర్శకుల వాదన తప్పని నిరూపించింది. గత మూడేళ్లుగా సరాసరి తరువాయి 2 వ పేజీలో...



## 4 రోజులు వర్షాలు

**వాతావరణ శాఖ వెల్లడి**

హైదరాబాద్, అక్టోబర్ 17 (ఈవార్తలు): తెలంగాణలో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని చెప్పింది. ఈ మేరకు ఆయా గ్రామాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. శుక్రవారం తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు

18.10.2025

మేషం: వ్యాపారాలు, ఉద్యోగాలలో పరిస్థితులు అనుకూలిస్తాయి. నూతన వ్యక్తులతో పరిచయాలు కలుగతాయి. మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. సంఘంలో ప్రముఖుల ఆదరణ పెరుగుతుంది. విలువైన వస్తు, వస్త్ర లాభాలు అందుతాయి. నూతన ఉద్యోగ అవకాశములు అందుతాయి.

వృషభం: వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆర్థిక లావాదేవీలు నిరుత్సాహపరుస్తాయి. ఉద్యోగాలలో ఊహించని సమస్యలు ఎదురవుతాయి. వృధా ప్రయాణాలు చెయ్యవలసి వస్తుంది. ఇంటాబయట ఒత్తిడులు పెరుగుతాయి.

మిధునం: ఆరోగ్య పరంగా చికాకులు తప్పవు. సన్నిహితులతో విభేదాలు కలుగుతాయి. చేపట్టిన పనులలో శ్రమాధిక్యత కలుగుతుంది. వ్యాపార, ఉద్యోగాలలో సమస్యలు తప్పవు. ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉంటుంది. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి.

కర్కాటకం: వ్యాపారాలు ఆశించిన రీతిలో రాణిస్తాయి. బంధు మిత్రులతో సఖ్యత కలుగుతుంది. ఉద్యోగాలలో మరింత అనుకూల వాతావరణం ఉంటుంది. నిరుద్యోగులకు అధికారుల అనుగ్రహం పొందుతారు. కొన్ని పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఇంటా బయట అందరిలోనూ గుర్తింపు లభిస్తుంది.

సింహం: స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. చేపట్టిన వ్యవహారాలలో అవాంతరాలు కలుగుతాయి. కుటుంబ సభ్యులతో విభేదాలు కలుగుతాయి. వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి. ఉద్యోగాలలో ఊహించని మార్పులు ఉంటాయి. నూతన రుణయత్నాలు చేస్తారు. ఆకస్మిక ప్రయాణాల వలన మార్గ అవరోధాలు కలుగుతాయి.

కన్య: వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఆప్తుల నుండి శుభవార్తలు అందుతాయి. ఆకస్మిక ధన, వస్తు లాభాలు పొందుతారు. ఉద్యోగాలలో సమస్యలు తొలగుతాయి. చిన్ననాటి మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. విందువినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు.

తుల: పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. చేపట్టిన పనుల్లో అవాంతరాలు కలుగుతాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. వ్యాపార, ఉద్యోగాలలో ఇబ్బందులు తప్పవు. వృధా ఖర్చుల విషయంలో పునరాలోచన చెయ్యాలి. కుటుంబ సభ్యులతో వివాదాలు చికాకు పరుస్తాయి.

వృశ్చికం: మిత్రులతో విందువినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. నూతన ఉద్యోగ అవకాశములు లభిస్తాయి. ప్రముఖులతో పరిచయాలు విస్తృతమౌతాయి. వ్యాపార, ఉద్యోగాలలో ఒత్తిడులు తొలగుతాయి. స్థిరస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి.


ధనస్సు: చిన్ననాటి మిత్రులను కలుసుకుని కీలక విషయాలు చర్చిస్తారు. దీర్ఘకాలిక వివాదాలు తీరి ఊరట చెందుతారు. వ్యాపారాలు, ఉద్యోగాలలో అనుకూల మార్పులు ఉంటాయి. విద్యార్థులకు నూతన విద్యావకాశాలు లభిస్తాయి. సంఘంలో పేరు కలిగిన వారితో పరిచయాలు పెరుగుతాయి.

మకరం: ధనపరంగా ఇబ్బందులు తప్పవు. చేపట్టిన వ్యవహారాలలో చికాకులు తొలగుతాయి. కుటుంబ సభ్యులతో స్వల్ప విభేదాలు కలుగుతాయి. దైవ చింతన పెరుగుతుంది. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులుంటాయి. అనారోగ్య సమస్యలు చికాకు పరుస్తాయి. వృధా ప్రయాణాలు చేస్తారు.

కుంభం: ఆర్థిక ఇబ్బందులు చికాకు పరుస్తాయి. మిత్రులతో మాటపట్టింపులు తప్పవు. చేపట్టిన పనులు మందగిస్తాయి. వ్యాపారాలలో శ్రమకు తగిన ఫలితం కనిపించదు. ఉద్యోగాలలో అధికారుల నుండి సమస్యలు తప్పవు. నూతన రుణయత్నాలు చెయ్యవలసి వస్తుంది. ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది.

మీనం: వ్యాపారాలలో ఆశించిన రీతిలో లాభాలు అందుకుంటారు. కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. నూతన వాహనయోగం ఉన్నది. ఉద్యోగయత్నాలు సజావుగా సాగుతాయి. ఉద్యోగమున జీతబత్యముల విషయంలో శుభవార్తలు అందుతాయి. మొండి బాకీలు వసూలవుతాయి. పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

# భారత్ తగ్గదు



మొదటి పేజీ తరువాయి

వృద్ధిరేటు 7.8శాతంగా నమోదు చేస్తోంది. భారత్‌ను నమ్మకమైన, బాధ్యతాయుతమైన, సుస్థిర భాగస్వామిగా, ఎన్నో అవకాశాలకు కేంద్రంగా ప్రపంచం చూస్తోంది. సవాళ్లను సంస్కరణలుగా మార్చుకుంటున్న భారత్‌కు ఇదో గొప్ప అవకాశం. మునుపటి ప్రభుత్వాలు సంస్కరణలను బలవంతంగా అమలు చేశాయి. కానీ, ఇప్పుడు మాత్రం దృఢ నిశ్చయంతో చేస్తున్నాం. గత ప్రభుత్వాలు గరీబీ హటావో అని గొప్ప నినాదాలు ఇచ్చినప్పటికీ ఫలితం కనిపించలేదు. మేం 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశాం. నష్టాల్లో ఉన్న ప్రభుత్వ ఆధ్వర్యంలోని కంపెనీలను కాంగ్రెస్ మూసివేసేది. ఇప్పుడు అన్ని ప్రభుత్వరంగ సంస్థలు రికార్డుస్థాయి ఆదాయాన్ని తెచ్చిపెడుతున్నాయి. కాంగ్రెస్ హయాంలో గ్యాస్ కనెక్షన్‌కు కూడా ఎంపీల సిఫార్సు అవసరమయ్యేది. మేం 10 కోట్ల పేద కుటుంబాలకు ఉచితంగా కనెక్షన్లు ఇచ్చాం. బ్యాంకింగ్ రంగంలో అనేక సంస్కరణలు తెచ్చాం. ప్రజల శ్రేయస్సు, రాజ్యాంగానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రజల జీవితాలను మరింత సులభతరం చేయడంపైనే మా దృష్టి. మావోయిస్టు దాడులు, వారి సానుభూతిపరుల వల్ల ఎంతో నష్టం జరిగింది. వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. 2014 నుంచి తాము చేసిన కృషి వల్ల మావోయిస్టు ప్రభావిత జిల్లాల సంఖ్య 125 నుంచి 11కు తగ్గింది. గడిచిన మూడు రోజుల్లో 303 మంది మావోయిస్టులు లొంగిపోయారు. 303 రైఫిళ్లు, భారీ స్థాయిలో మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నాం. ఇప్పటివరకు ప్రభావితమైన ప్రాంతాలు 60-70 ఏళ్లలో తొలిసారి దీపావళి చేసుకుంటున్నాయి. త్వరలోనే మావోయిస్టు హింసకు ముగింపు పడనుంది. ఇది కూడా మోదీ గ్యారంటీ' అని పేర్కొన్నారు.

## దేశ పురోగతికి నదులే రహదారులు

భారతదేశ నదులు కేవలం వారసత్వ చిహ్నాలు మాత్రమే కావని, అవి దేశ ప్రగతికి కొత్త రహదారులుగా మారాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. గత కొన్నేళ్లుగా దేశంలో జలమార్గాలను అభివృద్ధి చేయడం ద్వారా రవాణా, పర్యాటక రంగాలు బలోపేతం అయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్ రాసిన ఒక ప్రత్యేక కథనాన్ని ప్రధాని శుక్రవారం తన 'ఎక్స్' సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు. 'వికసిత్ భారత్ నిర్మాణం దిశగా పునరుజ్జీవం పొందిన మన జలమార్గాలు ఎలా పయనిస్తున్నాయో" వివరిస్తూ సోనోవాల్ ఈ వ్యాసాన్ని రాశారు. దానిపై స్పందించిన ప్రధాని.. నదులే దేశ పురోగతికి కారణం అని పేర్కొన్నారు.



# 4 రోజులు వర్షాలు

మొదటి పేజీ తరువాయి

మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షం కురిసే ఛాన్స్ ఉందని చెప్పింది. శనివారం వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే ఉందని చెప్పింది. ఆదివారం కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు పడే అవకాశం ఉందని చెప్పింది. సోమవారం నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది.

# మీకంత సీన్ లేదు!

మొదటి పేజీ తరువాయి

ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టుపై అమెరికా సింగర్ మేరీ మిల్‌బెన్ స్పందించారు. ప్రధాని మోదీకి మద్దతుగా రాహుల్ గాంధీపై విమర్శలు గుప్పించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'మీరు తప్పుగా అనుకుంటున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షుడు ట్రంప్‌కు భయపడ్డం లేదు. దీర్ఘకాలంలో అమెరికాతో మంచి సంబంధాల గురించే మోదీ ఆలోచిస్తున్నారు. అదొక స్ట్రాటెజీ. మోదీ ఇండియాకు ఎప్పుడూ మంచే చేస్తారు. అది అభినందనీయం. దేశ నాయకులు దేశం కోసం ఏది మంచిదో అదే చేస్తారు. ఇలాంటి నాయకత్వాన్ని నువ్వు అర్థం చేసుకుంటావని నేను అనుకోవటం లేదు. ఎందుకంటే భారత ప్రధాని అయ్యే ఒక్క లక్షణం కూడా నీలో లేదు. నువ్వు మళ్లీ ఐ హేట్ ఇండియా టూర్ చేసుకుంటే మంచిది' అని పేర్కొన్నారు.

# రెండు సార్లు గెలిస్తే రేసులో ఉంటా

మొదటి పేజీ తరువాయి

చేశారాయన. నా పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంచి అభిప్రాయమే ఉందని అనిరుధ్ రెడ్డి అన్నారు. అనిరుధ్ రెడ్డి అంటే భోళా.. ఏం అడిగినా ప్రజల కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసమే అడుగుతాడని సీఎం రేవంత్ అంటుంటారని అనిరుధ్ రెడ్డి చెప్పారు. మంత్రుల జిల్లాలు, నియోజకవర్గాలకు ఎక్కువ నిధులు వెళ్తున్నాయని, నేను కూడా సీఎం అభ్యర్థిని అవుతాను అంటూ.. ఎమ్మెల్యే అనిరుధ్ చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారాయి.

# కొత్తగా 108 పీజీ మెడికల్ సీట్లు

మొదటి పేజీ తరువాయి

పీజీలో వైద్య విద్య అవకాశాలు మరింత విస్తరించనున్నాయి. రాష్ట్రంలోని కొత్త ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు ఇది ప్రోత్సాహకర పరిణామంగా అధికారులు భావిస్తున్నారు. 'రాష్ట్రానికి 9 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 29 విభాగాల్లో 108 పీజీ సీట్లు ఆమోదించబడ్డాయి. ఇది రాష్ట్ర వైద్య విద్యా మౌలిక సదుపాయాల విస్తరణకు ఎంతో దోహదం చేస్తుంది' అని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

# రండి.. కలిసిపోదాం

మొదటి పేజీ తరువాయి

వీడి జన జీవన స్రవంతిలో కలిసిపోవాలని మేం వారిని కోరుతూ వచ్చాం. ఇప్పుడు వారికి నైపుణ్యాలు కల్పించి, పునరావాసానికి ఏర్పాటు చేస్తాం' అని వెల్లడించారు. మావోయిస్టు పార్టీ అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ ఆయుధాలను వీడి 60 మంది ఉద్యమ సహచరులతో కలిసి జనజీవన స్రవంతిలో కలిసిన గంటల వ్యవధిలోనే ఆశన్న కూడా లొంగిపోతున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇద్దరు అగ్రనేతలు పోరాటాన్ని వీడటంతో మావోయిస్టు పార్టీకి గట్టి షాక్ తగిలింది. ఆశన్న స్వస్థలం ములుగు జిల్లా వెంకటాపూర్ (రామప్ప) మండలంలోని నర్సింగాపూర్ గ్రామం. నాలుగు దశాబ్దాల క్రితం పీపుల్స్‌వార్ ఉద్యమం వైపు ఆకర్షితులయ్యారు. వాసుదేవరావు ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు మండలంలోని లక్ష్మీదేవిపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. అనంతరం అప్పటి హనుమకొండ మండలం కాజీపేటలోని ఫాతిమా స్కూల్‌లో సెకండరీ విద్యనభ్యసించారు. కాకతీయ వర్సిటీలో డిగ్రీ చదువుతూ రాడికల్ స్టూడెంట్ యూనియన్ (ఆర్ఎస్‌యూ)కు నాయకత్వం వహిస్తూ ఆ తర్వాత పరిణామాల నేపథ్యంలో 25 ఏళ్ల వయసులోనే అజ్ఞాతంలోకి వెళ్లారు. ప్రస్తుతం వాసుదేవరావు వయసు 60 ఏళ్లు పైబడి ఉంటుందని సమాచారం.

## బాంబ్ నిపుణుడిగా పేరు

కీలక దాడులకు ఆశన్న వ్యూహకర్త. బాంబ్ నిపుణుడిగా పేరుంది. దండకారణ్య సబ్‌జోనల్ బ్యూరో కార్యదర్శిగా రూపేశ్ పేరుతో వ్యవహరించిన ఆశన్న.. ఏపీ సీఎం చంద్రబాబు, మాజీ సీఎం నేదురుమల్లి జనార్దనరెడ్డిపై బాంబులు పేల్చి హత్యాయత్నం, 1999లో ఐపీఎస్ అధికారి ఉమేశ్‌చంద్ర హత్య, 2000లో నాటి హెూంమంత్రి మాధవరెడ్డి హత్య లాంటి ఘటనలకు నేతృత్వం వహించినట్లు చెప్తారు.

# బంద్ సరే.. రిజర్వేషన్లేవి?

మొదటి పేజీ తరువాయి

బీసీలకు అన్యాయం చేస్తున్నాయని ఆరోపిస్తూ, 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని పట్టుబడుతున్నారు. బీసీ జేఏసీ ఈ బంద్‌ను నిర్వహిస్తోంది. జేఏసీ చైర్మన్, బీజేపీ రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య నేతృత్వంలో ఈ ఆందోళన జరుగుతోంది. ప్రజలు శాంతియుతంగా పాల్గొనాలని, దుకాణాలు, వ్యాపార సంస్థలు మూసివేయాలని కోరారు. ఆర్టీసీ బస్సులు నడపకూడదని పిలుపునిచ్చారు. ఈ బంద్‌కు అన్ని రాజకీయ పార్టీలు సంపూర్ణ మద్దతు తెలిపాయి. బంద్‌లో పార్టీ నాయకులంతా పాల్గొంటారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ బంద్‌తో కాంగ్రెస్ సర్కారుకు బీసీ సెగ తగిలిస్తామని బీఆర్ఎస్ అంటోంది. రాష్ట్ర ప్రభుత్వం న్యాయనిపుణులతో చర్చించి అఖిలపక్షాన్ని పెట్టాలని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. 'న్యాయం కోసం బంద్'కు పూర్తి మద్దతు ఉంటుందని కవిత, బంద్‌లో పాల్గొంటామని తీన్మార్ మల్లన్న తెలిపారు. సీపీఐ, ఇతర సంఘాలు కూడా మద్దతు ప్రకటించాయి. అటు.. బంద్‌ను శాంతియుతంగా నిర్వహించాలని డీజీపీ శివధర్ రెడ్డి పిలుపునిచ్చారు. బంద్ పేరుతో అక్రమాలు, ఆటంకాలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## రిజర్వేషన్లపై చిత్తశుద్ధి ఏది?

బీసీ రిజర్వేషన్లు అనగానే బీసీ నాయకులు కూడా ధర్నాలు, నిరసనలకే పరిమితం అవుతున్నారన్నది ప్రధాన విమర్శ. గత 20-30 ఏళ్లుగా ఇదే జరుగుతోందని, బీసీ ఉద్యమాన్ని వ్యక్తిగత అవసరాల కోసం వాడుకున్నారు తప్ప బీసీలకు ఒరిగిందేమీ లేదని మేధావులు పేర్కొంటున్నారు. తమ స్వలాభం కోసం బీసీ జెండాను ఎత్తుకున్న నాయకులు.. ఏళ్ల పాటు కానరాకుండా పోయారని, ఇప్పుడు ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడటంతో మళ్లీ గుంపులో వచ్చి చేరుతున్నారని మండిపడుతున్నారు. తెలంగాణ ఉద్యమాన్ని రాష్ట్రంలో ఎంత ప్రభావవంతంగా నడిపారో, ఢిల్లీ వేదికగానూ అంతే ధాటిగా సాగిందని.. కానీ, బీసీ ఉద్యమం నిరసనలు, ర్యాలీలు, ధర్నాలకే సరిపోతోందని పేర్కొంటున్నారు. చట్టబద్ధంగా రిజర్వేషన్లు కావాలంటే ఢిల్లీ వేదికగా, కేంద్రంతో పోరాడాలని సూచిస్తున్నారు. రాజకీయ నాయకుల ప్రలోభాలకు లొంగిపోతే బీసీ ఉద్యమం నీరు గారుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# స్థానిక ఎన్నికలు ఇంకెప్పుడు?

మొదటి పేజీ తరువాయి

నుంచి సమాధానం అందిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని వివరించారు. బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచుతూ నోటిఫికేషన్ ఇచ్చినందున, అదే కారణంగా గత ఎన్నికల షెడ్యూల్‌ను నిలిపివేశామని చెప్పారు. సుప్రీంకోర్టు ఎన్నికలు నిర్వహించవచ్చని చెప్పినప్పటికీ, ఆ ఆదేశాల కాపీ తమ వద్ద లేదని ఈసీ న్యాయవాది వివరించారు. కొత్త రిజర్వేషన్లపై ప్రభుత్వంతో చర్చించి రీ నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉందని, ఇందుకోసం రెండు వారాల సమయం అవసరమని ఈసీ తరఫు న్యాయవాది అభ్యర్థించారు. ప్రభుత్వం తరఫు న్యాయవాది మాట్లాడుతూ, రిజర్వేషన్ల తుది నిర్ణయానికి మూడు వారాల సమయం కావాలని కోర్టును కోరారు. దీనిపై విచారణ చేసిన హైకోర్టు, ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు రెండు వారాల గడువు ఇచ్చింది. ఈ వ్యవధిలో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. అలాగే, ఇటీవల విడుదలైన స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ నిలిపివేసిన విషయాన్ని ఈసీ న్యాయవాది కోర్టుకు తెలిపారు. ప్రభుత్వం నుంచి రిజర్వేషన్లపై తుది సమాధానం అందిన తర్వాతే తదుపరి చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. హైకోర్టు ఈ వ్యాఖ్యలతో స్థానిక సంస్థల ఎన్నికలపై మరలా చర్చ ముమ్మరమైంది. బీసీ రిజర్వేషన్ల అంశం పరిష్కారం అయ్యే వరకు ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం తక్కువగానే కనిపిస్తోంది. అయినప్పటికీ, హైకోర్టు ఇచ్చిన గడువులో ప్రభుత్వం, ఈసీ స్పందిస్తే ఎన్నికల ప్రక్రియ త్వరలోనే ప్రారంభమయ్యే అవకాశం ఉందని న్యాయవర్గాలు భావిస్తున్నాయి.



# కాంగ్రెస్ కోసం ఆస్తులు అమ్ముకున్నా

మొదటి పేజీ తరువాయి

చేసింది' అని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి పదవి ఇస్తామని స్పష్టమైన హామీ ఇచ్చి, ఇప్పుడు మాట తప్పారని ఆయన మండిపడ్డారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి కాంగ్రెస్ పెద్దపీట వేస్తోందని ఆయన ఆరోపించారు. 'బీఆర్ఎస్ నుంచి వచ్చిన నలుగురికి మంత్రి పదవులు కట్టబెట్టారు. బీజేపీ నుంచి వచ్చిన వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి, ఆయన కుమారుడికి ఎంపీ టికెట్ ఇచ్చారు. కానీ, పార్టీ కోసం కష్టపడిన నన్ను మాత్రం పక్కన పెట్టారు' అని రాజగోపాల్ రెడ్డి వాపోయారు. కాంగ్రెస్‌లోని కొందరు నాయకులే తనకు మంత్రి పదవి రాకుండా అడ్డుకుంటున్నారని ఆయన ఆరోపించారు. పార్టీ కోసం ఎంతో త్యాగం చేసిన తనకు అన్యాయం జరిగిందని అసంతృప్తి వ్యక్తం చేశారు.

# 19న జనవరి ఆర్జిత సేవా టికెట్లు

మొదటి పేజీ తరువాయి

ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవా టికెట్లను ఈనెల 23న ఉదయం పది 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటా కూడా 23 మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్ అందుబాటులో ఉండనుంది. శ్రీవాని ట్రస్టు దర్శన టికెట్ల కోటాను 24న ఉదయం 11 గంటలకు, వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెన్ల కోటాను 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను 25న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు. తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను 25న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. శ్రీవారి ఆర్జిత, దర్శన టికెట్లను https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చని టీటీడీ పేర్కొంది.

# లడ్డూ ధరలు పెంచడం లేదు

## స్పష్టం చేసిన టీటీడీ



తిరుమల, అక్టోబర్ 17 (ఈవార్తలు): శ్రీవారి లడ్డూ ప్రసాదాల ధరలను పెంచుతున్నట్లు కొందరు అవాస్తవ సమాచారాన్ని ప్రచారం చేయడం సరికాదని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానముల ప్రతిష్టను, రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశ్యంతో ఇలాంటి చౌకబారు వార్తలను ప్రచారం చేయడం మానుకోవాలని సూచించారు. ఇలాంటి వార్తలు పూర్తి అవాస్తమని, ఆధారాలు లేని వార్తలని ఖండించారు. ఉద్దేశ్యపూర్వకంగా తప్పుడు వార్తలను ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. టీటీడీ లడ్డూ ప్రసాదాల ధరలను పెంచే ఆలోచనేలేదని స్పష్టం చేశారు.

## విద్య, ఉద్యోగవాణి

### డీఆర్‌డీఓలో ఉద్యోగాలు

మొత్తం పోస్టులు: 105

అర్హత: ఐటీఐ, డిప్లొమా, ఇంజనీరింగ్, డిగ్రీ ఉత్తీర్ణులైనవారు

ఇంటర్వ్యూ తేదీ: నవంబర్ 04, 2025

ఇంటర్వ్యూ ప్రదేశం: బెంగళూరు

వెబ్‌సైట్: https://www.drdo.gov.in/



# కార్పొరేట్ స్కూళ్లలా సర్కారు బడులు

## విద్యాశాఖపై సమీక్షలో సీఎం రేవంత్

హైదరాబాద్, అక్టోబర్ 17 (ఈవార్తలు): ప్రతీ ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ స్కూల్ తరహాలో తీర్చిదిద్దాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈరోజు(శుక్రవారం, అక్టోబర్ 17వ తేదీ) విద్యాశాఖ సమీక్షలో అధికారులకు సీఎం రేవంత్ పలు సూచనలు చేశారు. 'పేదలకు మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతుల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయండి. తొలి దశలో ఔటర్ రింగురోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్ పై దృష్టి సారించండి. ప్రతీ ప్రభుత్వ పాఠశాల కార్పొరేట్ స్కూల్ తరహాలో తీర్చిదిద్దాలి. ప్లే గ్రౌండ్, అవసరమైన తరగతి గదులతోపాటు మంచి వాతావరణం ఉండేలా చూడాలి. ఇందుకు విద్యా శాఖ పరిధిలో ఉన్న స్థలాలను గుర్తించండి. సరైన సౌకర్యాలు లేని పాఠశాలలను దగ్గరలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలానికి తరలించండి. నర్సరీ నుంచి 4 వ తరగతి వరకు నూతన స్కూల్స్ ను పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాలి. అక్కడ కార్పొరేట్ స్కూల్ స్థాయిలో అన్ని వసతులతో విద్యను అందించే ఏర్పాటు చేయండి విద్యార్థులకు పాలు, బ్రేక్ ఫాస్ట్, లంచ్ అందించేలా ప్రణాళికలు సిద్ధం చేయండి 2026 జూన్ లో అకడమిక్ ఇయర్ నుంచి అమలు జరిగేలా యాక్షన్ ప్లాన్‌తో ముందుకెళ్లాలి' అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

# కాంగ్రెస్‌కే మద్దతు.. మేం పోటీ చేయడం లేదు

**అసదుద్దీన్ ఒవైసీ కీలక ప్రకటన**



జూబ్లీహిల్స్/హైదరాబాద్, అక్టోబర్ 17 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉప ఎన్నికలో మజ్లిస్ పార్టీ పోటీ చేయడం లేదని ఆ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కీలక ప్రకటన చేశారు. బీజేపీని నిలువరించడానికి కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. నవంబర్ 11న జరిగే ఉప ఎన్నికకు నామినేషన్ దాఖలు చేయడానికి ముందు కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ శుక్రవారం ఒవైసీని కలిశారు. నవీన్ యాదవ్‌తో పాటు పార్టీ సీనియర్ నాయకుడు అజారుద్దీన్ కూడా ఉన్నారు. అజారుద్దీన్ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఈ సందర్భంగా ఒవైసీ మాట్లాడుతూ, బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉందని, ఈ కాలంలో జూబ్లీహిల్స్ నుంచి ఆ పార్టీకి చెందిన వారే ఎమ్మెల్యేగా ఉన్నారని, కానీ నియోజకవర్గం అభివృద్ధి చెందలేదని విమర్శించారు. నియోజకవర్గంలోని 3.98 లక్షల మంది ఓటర్లు ఇప్పుడు అభివృద్ధిని కోరుకుంటున్నారని అన్నారు. ఈ నియోజకవర్గంలో అనేక మురికివాడలు ఉన్నాయని, అన్ని వార్డులలో పౌర సౌకర్యాలు మెరుగు పరచాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇప్పుడు వచ్చిన ఉప ఎన్నిక ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి ఒక మంచి అవకాశంగా ఆయన అభిప్రాయపడ్డారు. 2023లో బీఆర్ఎస్ మాగంటి గోపీనాథ్‌కు టిక్కెట్ ఇవ్వకపోయి ఉంటే ఈ ఉప ఎన్నిక వచ్చి ఉండేది కాదని అన్నారు. గోపీనాథ్ అనారోగ్యంతో ఉన్నారనే విషయం 2023 నుంచి తెలుసని అన్నారు. నియోజకవర్గంలోని అన్ని వర్గాలను కలుపుకుని ముందుకు సాగాలని నవీన్ యాదవ్‌కు అసదుద్దీన్ సూచించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా మాగంటి సునీత పోటీ చేస్తుండగా, కాంగ్రెస్ నవీన్ యాదవ్‌కు టిక్కెట్ ఇచ్చింది. నవీన్ యాదవ్ గతంలో మజ్లిస్ పార్టీ నుంచి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పోటీ చేశారు. కాగా, గత ఏడాది జరిగిన లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓట్లు బీజేపీకి బదిలీ అయినట్లు అసదుద్దీన్ ఒవైసీ భావిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్‌లో 37 శాతం ఓట్లు సాధించిన బీఆర్ఎస్ ఆ తర్వాత 5 నెలలకు జరిగిన లోక్ సభ ఎన్నికల్లో 15 శాతానికి పడిపోయిందని అసదుద్దీన్ గుర్తు చేశారు. నవీన్ యాదవ్ 2014 అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నుంచి మజ్లిస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి, మాగంటి గోపీనాథ్ చేతిలో ఓడిపోయారు. 2018లో నవీన్ యాదవ్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి మూడో స్థానానికి పరిమితమయ్యారు. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు నవీన్ యాదవ్ కాంగ్రెస్ పార్టీలో చేరినప్పటికీ, ఆ పార్టీ అజారుద్దీన్‌కు టిక్కెట్ కేటాయించింది. బీజేపీ నుంచి లంకల దీపక్ రెడ్డి పోటీ చేస్తున్నారు.



# రూ.6,000 కోవిడ్ టెస్టును రూ.12కే

**హ్యూవెల్ సంస్థపై కేటీఆర్ ప్రశంసలు**

**సుల్తాన్‌పూర్ హ్యూవెల్ కొత్త కెమిస్ట్రీ ల్యాబ్ ప్రారంభం**

**ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన కేటీఆర్**

సుల్తాన్‌పూర్, అక్టోబర్ 17 (ఈవార్తలు): సామాన్యుడికి ఉపయోగపడని సాంకేతికత, పరిశోధనల వల్ల ప్రయోజనం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కోవిడ్ మహమ్మారి సమయంలో రూ.6,000 ఖర్చయ్యే ఆర్టీపీసీఆర్ టెస్టును కేవలం రూ.12కే అందుబాటులోకి తెచ్చిన హ్యూవెల్ సంస్థ కృషి అద్భుతమని ఆయన కొనియాడారు. తెలంగాణలోని సుల్తాన్‌పూర్ మెడికల్ డివైసెస్ పార్క్‌లో హ్యూవెల్ ఏర్పాటు చేసిన నూతన కెమిస్ట్రీ ల్యాబ్‌ను కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "దేశంలో వినియోగించే వైద్య పరికరాల్లో దాదాపు 70 నుంచి 80 శాతం విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. ఈ పరిస్థితిని మార్చి, మన దేశంలోనే తక్కువ ధరకు నాణ్యమైన పరికరాలను ఉత్పత్తి చేయాలనే గొప్ప సంకల్పంతో కేసీఆర్ గారి హయాంలో ఈ మెడికల్ డివైసెస్ పార్క్‌ను ఏర్పాటు చేశాం" అని తెలిపారు. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, వైద్య ఖర్చులను సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన వివరించారు. ఒకప్పుడు రాళ్లు, క్రషర్లతో నిండిన సుల్తాన్‌పూర్ ప్రాంతం నేడు వేలాది మందికి ఉపాధి కల్పించే పారిశ్రామిక కేంద్రంగా మారడం ఎంతో సంతోషాన్నిస్తోందని కేటీఆర్ అన్నారు. కోవిడ్ కష్టకాలంలో టెస్టింగ్ కిట్లకు తీవ్రమైన కొరత, అధిక డిమాండ్ ఉండేదని గుర్తుచేశారు. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో పోర్టబుల్ ఆర్టీపీసీఆర్ కిట్ల వంటి ఆవిష్కరణలతో ప్రజలకు మేలు చేసిన హ్యూవెల్ యాజమాన్యం, శిశిర్, రచన బృందాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. "సామాన్యుడికి ఫలాలు అందించని పరిశోధన వ్యర్థమని కేసీఆర్ గారు మాకు ఎప్పుడూ చెబుతుంటారు. ఆ మాటలను నిజం చేస్తూ హ్యూవెల్ పనిచేస్తోంది" అని అన్నారు.

# రష్యా సైన్యంలో హైదరాబాద్ వాసి

**విడిపించేందుకు రంగంలోకి కేంద్రం**

హైదరాబాద్/న్యూఢిల్లీ: ఉద్యోగం కోసం రష్యా వెళ్లిన ఓ హైదరాబాదీ, ఏజెంట్ చేతిలో మోసపోయి ప్రస్తుతం రష్యా-ఉక్రెయిన్ యుద్ధరంగంలో చిక్కుకుపోయాడు. తనను ఎలాగైనా కాపాడాలంటూ అతను పంపిన వీడియో సందేశం కలకలం రేపడంతో, భారత ప్రభుత్వం రంగంలోకి దిగింది. బాధితుడిని సైన్యం నుంచి సురక్షితంగా విడిపించి స్వదేశానికి రప్పించేందుకు మాస్కోలోని భారత రాయబార కార్యాలయం రష్యా అధికారులతో సంప్రదింపులు ప్రారంభించింది. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌కు చెందిన 37 ఏళ్ల మహమ్మద్ అహ్మద్, ముంబైకి చెందిన ఓ ఏజెంట్ మాటలు నమ్మి నిర్మాణ రంగంలో ఉద్యోగం కోసం ఏప్రిల్ 25న రష్యా వెళ్లాడు. అయితే, అక్కడికి వెళ్లాక అతడిని మోసగించి, బలవంతంగా రష్యా సైన్యంలో చేర్చారు. ఆయుధ శిక్షణ ఇచ్చి ఉక్రెయిన్ సరిహద్దుకు పంపించారు. అక్కడ ఎదుర్కొంటున్న నరకయాతనను వివరిస్తూ, తనను కాపాడాలంటూ అహ్మద్ తన కుటుంబానికి ఇటీవల ఒక వీడియో సందేశం పంపాడు. ఈ విషయం తెలుసుకున్న అహ్మద్ భార్య అఫ్షా బేగం, ఇతర కుటుంబ సభ్యులు వెంటనే హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని ఆశ్రయించారు. ఒవైసీ ఈ విషయాన్ని విదేశాంగ శాఖ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లడంతో అధికార యంత్రాంగం కదిలింది. మాస్కోలోని భారత రాయబార కార్యాలయం వెంటనే స్పందించి, అహ్మద్ వివరాలను రష్యా అధికారులకు అందజేసింది. అతడిని వెంటనే సైన్యం నుంచి విడుదల చేసి, సురక్షితంగా భారత్‌కు పంపాలని అధికారికంగా అభ్యర్థించింది. ఈ విషయాన్ని మాస్కోలోని భారత రాయబార కార్యాలయ కౌన్సిలర్, ఎంపీ ఒవైసీకి తెలియజేశారు. "నాతో పాటు 25 మందిని ఇక్కడికి తీసుకొచ్చారు. వారిలో 17 మంది ఇప్పటికే చనిపోయారు. వారిలో ఒక భారతీయుడు కూడా ఉన్నాడు. యుద్ధం చేయడానికి నేను, మరో ముగ్గురు భారతీయులం నిరాకరించగా.. తుపాకులతో బెదిరించారు. నా కాలికి గాయం కావడంతో నడవలేని స్థితిలో ఉన్నాను. అయినా రేపు యుద్ధానికి వెళ్లమంటున్నారు" అంటూ అహ్మద్ వీడియోలో కన్నీటిపర్యంతమయ్యాడు. తన ఈ దుస్థితికి కారణమైన ఏజెంట్‌ను కఠినంగా శిక్షించాలని అతను వేడుకున్నాడు. గతేడాది కూడా ఇలాగే దుబాయ్ ఏజెంట్ చేతిలో మోసపోయి రష్యా సైన్యంలో చేరిన హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ అస్ఫాన్ అనే యువకుడు యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఇప్పుడు అహ్మద్ ఉదంతం వెలుగులోకి రావడంతో ఉద్యోగం పేరుతో అమాయకులను యుద్ధంలోకి పంపుతున్న ఏజెంట్ల మోసాలపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.

# రూ.110 కోట్ల భూమి సేఫ్

**కుల్సుంపురాలో సర్కారు భూమిని కాపాడిన హైడ్రా**

హైదరాబాద్, అక్టోబర్ 17 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని కుల్సుంపురాలో దాదాపు రూ. 110 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని హైడ్రా పరిరక్షించింది. గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని కుల్సుంపురాలో జరిగిన ఆక్రమణలను తొలగించి, 1.30 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంది. ప్రజావసరాల కోసం ఈ భూమిని ఉపయోగించాలని ప్రభుత్వం గతంలో భావించింది. ముఖ్యంగా, ఈ స్థలాన్ని డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి కేటాయించే యోచనలో ప్రభుత్వం ఉంది. ఈ నేపథ్యంలో, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ఈ భూమిని పరిరక్షించాల్సిందిగా హైడ్రాను కోరారు. స్థానికులు కూడా భూ ఆక్రమణలపై హైడ్రాకు ఫిర్యాదు చేశారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు శుక్రవారం హైడ్రా సిబ్బంది ఆక్రమణలను తొలగించారు. అయితే, అశోక్ సింగ్ అనే వ్యక్తి ఈ భూమి తనదని వాదిస్తున్నాడు. ఈ క్రమంలో, సిటీ సివిల్ కోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వెలువరించింది. ఇదివరకే రెవెన్యూ అధికారులు రెండుసార్లు ఈ భూమిలో ఆక్రమణలను తొలగించారు. అయినప్పటికీ, అశోక్ సింగ్ ఆ స్థలాన్ని ఖాళీ చేయలేదు. అంతేకాకుండా, ఖాళీ చేయించేందుకు ప్రయత్నించిన అధికారులపై దాడులకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. అశోక్ సింగ్‌పై లంగర్‌హౌస్, మంగళ్‌హాట్, షాహినాయత్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లలో ఎనిమిదికి పైగా కేసులు నమోదయ్యాయి.

# రేవంత్ గన్ కల్చర్ తెచ్చారు

**వ్యాపారులకు తుపాకులు చూపించి బెదిరిస్తున్నారు**

**కాంగ్రెస్ నేతలు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు**

**మాజీమంత్రి హరీశ్ రావు మండిపాటు**



హైదరాబాద్, అక్టోబర్ 17 (ఈవార్తలు): తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గన్ కల్చర్‌ను ప్రోత్సహిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు తుపాకులు చూపి వ్యాపారవేత్తలను బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. గతంలో కేటీఆర్ వర్షంలో సైతం టెక్ మహీంద్ర సీఈవో గుర్నానీకి గొడుగు పట్టి పెట్టుబడులను ఆహ్వానించిన చరిత్ర తమదని గుర్తు చేశారు. తెలంగాణలో పెట్టుబడులు తగ్గిపోయాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈరోజు మీడియాతో మాట్లాడుతూ, డిసెంబర్ 1 నుంచి 9 వరకు ప్రభుత్వ విజయోత్సవాలు నిర్వహిస్తామని కాంగ్రెస్ చెబుతోందని, అయితే తుపాకులు పెట్టి అక్రమ వసూళ్లకు పాల్పడినందుకు ఈ ఉత్సవాలు చేస్తున్నారా అని హరీశ్ రావు ప్రశ్నించారు. కాంట్రాక్టుల కోసం మంత్రివర్గ సమావేశంలో మంత్రులు కొట్లాడుకుంటున్నారని, వారి మధ్య తగాదాలు పెరిగి రోజూ వీధిన పడి పరువు తీస్తున్నందుకు విజయోత్సవాలు జరుపుకుంటున్నారా అని ఆయన ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, ప్రాజెక్టులు కట్టలేదని, పైగా ఉన్న పథకాలను రద్దు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అందుకే విజయోత్సవాలు జరుపుకుంటున్నారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్టుబడిదారులకు, పారిశ్రామికవేత్తలకు, సినీ పరిశ్రమ పెద్దలకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, పేదలకు ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. తెలంగాణను సాధించి, పదేళ్లు అద్భుతంగా పాలించిన తమ పార్టీకి రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యత ఉందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ భవన్ తలుపులు ప్రతి ఒక్కరికీ తెరిచే ఉంటాయని ఆయన అన్నారు. డీజీపీ శివధర్ రెడ్డి ఖాకీ బుక్‌లో మంత్రులకు ప్రత్యేక నిబంధనలు ఉన్నాయా అని హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణలో పింక్ బుక్, రెడ్ బుక్, బ్లూ బుక్ లేవని డీజీపీ ఇటీవల చెప్పారని, కానీ స్వయంగా మంత్రి కుటుంబ సభ్యులే ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని ఆయన అన్నారు. సామాజిక మాధ్యమాల్లో రీట్వీట్ చేస్తేనే రాత్రికి రాత్రి అరెస్టు చేస్తున్నారని విమర్శించారు. కొంతమంది తుపాకులు పట్టుకుని తిరుగుతుంటే డీజీపీకి కనిపించడం లేదా అని నిలదీశారు. తెలంగాణలో మంత్రుల పంచాయితులను పరిష్కరించేందుకు మంత్రివర్గ సమావేశాలు నిర్వహిస్తున్నారని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. కమీషన్ కోసం ఒకరు, కాంట్రాక్టుల కోసం మరొకరు, వాటాల కోసం మరొకరు, అక్రమ వసూళ్ల కోసం, కబ్జాల కోసం మంత్రులు వర్గాలుగా విడిపోయారని ఆయన ఆరోపించారు. మంత్రి వర్గ సమావేశం దండుపాళ్యం ముఠాలా మారిపోయిందని ఆయన విమర్శించారు. గత కొన్ని రోజులుగా మంత్రుల మధ్య తగాదాలే చూస్తున్నామని, పాలన గాలికి వదిలేశారని ఆయన అన్నారు.

## 25 నుంచి కవిత 'జాగృతి జనయాత్ర'

హైదరాబాద్, అక్టోబర్ 17 (ఈవార్తలు): తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మరోసారి ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని, ప్రభుత్వ హామీల అమలుపై దృష్టి సారించే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా 'జాగృతి జనయాత్ర' చేపట్టనున్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి ఈ యాత్ర ప్రారంభం కానున్నట్లు జాగృతి నాయకులు అధికారికంగా వెల్లడించారు. ఈ యాత్రకు సంబంధించిన కార్యాచరణపై చర్చించేందుకు శుక్రవారం రంగారెడ్డి జిల్లా జాగృతి విస్తృత స్థాయి సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ భేటీకి రాష్ట్ర నాయకులు కోల శ్రీనివాస్, నరేష్, అర్చన సేనపతి హాజరయ్యారు. యాత్రను విజయవంతం చేసేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై జిల్లా ముఖ్య నాయకులతో వీరు సమీక్ష నిర్వహించారు. సామాజిక తెలంగాణ సాధన, బీసీ రిజర్వేషన్ల పెంపు, ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీల అమలు వంటి ప్రధాన డిమాండ్లతో కవిత ప్రజల ముందుకు వెళ్లనున్నారని నాయకులు తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలతో మమేకమవుతూ... నిరుద్యోగులు, రైతులు, మహిళలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ఈ యాత్ర ముఖ్య ఉద్దేశమని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జాగృతి జిల్లా మహిళా అధ్యక్షురాలు బండారి లావణ్యతో పాటు రాష్ట్ర స్థాయి నేతలు ముస్తఫా, రామకోటి, రాము యాదవ్, నవీన్ గౌడ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## కుమారుడికి ప్రమాదం అని నమ్మించి..!

**35 లక్షలు కాజేసిన సైబర్ నేరగాడు**

లండన్/హైదరాబాద్, అక్టోబర్ 17 (ఈవార్తలు): లండన్‌లో మీ కుమారుడికి ప్రమాదం జరిగిందని నమ్మించి సైబర్ నేరగాడు హైదరాబాద్ లోని ఓ వృద్ధురాలి నుంచి రూ. 35 లక్షలు కాజేసిన ఘటన కలకలం సృష్టించింది. సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, నగరానికి చెందిన 61 ఏళ్ల వృద్ధురాలికి ఒక వ్యక్తి వాట్సాప్ కాల్ చేశాడు. తన పేరు స్టీవ్ అని, లండన్‌లో డాక్టర్‌గా పని చేస్తున్నానని పరిచయం చేసుకున్నాడు. లండన్ విమానాశ్రయంలో మీ కుమారుడికి ప్రమాదం జరిగిందని, తలకు బలమైన గాయాలయ్యాయని ఆ వృద్ధురాలికి చెప్పాడు. లగేజీ మిస్ కావడంతో ఎలాంటి ఐడెంటిటీ లేకుండా పోయిందని, ఆసుపత్రిలో చేర్చుకోవడం లేదని నమ్మబలికాడు. ఎలాగైనా తన కుమారుడికి చికిత్స అందించాలని ఆ వృద్ధురాలు ప్రాధేయపడింది. చికిత్స కోసం విడతలవారీగా రూ. 35 లక్షలకు పైగా పంపించింది. తన కుమారుడు ఎలా ఉన్నాడో తెలుసుకోవడానికి ఫొటో, వీడియో పంపించాలని కోరగా, ఆ వ్యక్తి అందుకు నిరాకరించాడు. అనుమానం వచ్చిన బాధితురాలు కొడుకును సంప్రదించింది. తాను క్షేమంగా ఉన్నానని, ఎలాంటి ప్రమాదం జరగలేదని చెప్పడంతో మోసపోయానని గ్రహించిన వృద్ధురాలు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

# ఫారెక్స్ సంస్థల్లో ఈడీ తనిఖీలు

**ఆర్బీఐ లైసెన్స్ లేకుండా సంస్థలను నిర్వహిస్తున్నారని ఫిర్యాదులు**

**ప్రిజమ్, గరుడ, విక్టరీ, విమల్‌నాథ్ ఫారెక్స్ సంస్థల్లో సోదాలు**

హైదరాబాద్, అక్టోబర్ 17 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలోని పలు ఫారెక్స్ సంస్థలపై ఈడీ అధికారులు దాడులు నిర్వహించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నుంచి లైసెన్స్ లేకుండానే ఈ సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయనే ఫిర్యాదుల మేరకు ఈ తనిఖీలు చేపట్టారు. ప్రిజమ్, గరుడ, విక్టరీ, విమల్‌నాథ్ ఫారెక్స్ సంస్థల్లో ఈడీ అధికారులు సోదాలు జరిపారు. గతంలో ఆర్బీఐ అధికారులు జరిపిన సోదాల్లో ఈ సంస్థల్లో అవకతవకలు వెలుగుచూడటంతో, ఈడీ కూడా తనిఖీలు చేపట్టింది. ఆర్బీఐ అనుమతులు లేకుండా, బోగస్ పత్రాలతో ఈ సంస్థలు నిర్వహిస్తున్నట్లు సోదాల్లో తేలింది. కొన్ని ఫారెక్స్ సంస్థలు అక్రమంగా డబ్బు మార్పిడి వ్యాపారం చేస్తున్నట్లు ఈడీ దర్యాప్తులో వెల్లడైంది. పలు సంస్థలు ఫెమా నిబంధనలను ఉల్లంఘించినట్లు ఈడీ పేర్కొంది.

## జూబ్లీహిల్స్‌లో 11న సెలవు

జూబ్లీహిల్స్/హైదరాబాద్, అక్టోబర్ 17 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి నవంబర్ 11న ఉప ఎన్నిక పోలింగ్ జరగనున్నందున, ఆ రోజు నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నెల 21 వరకు నామినేషన్లకు తుది గడువు ఉంది. వివిధ పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఉప ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా ప్రధాన రాజకీయ పార్టీలు ప్రచారంలో ముమ్మరంగా పాల్గొంటున్నాయి.

## మద్యం టెండర్లకు భారీగా తగ్గిన డిమాండ్

హైదరాబాద్, అక్టోబర్ 17 (ఈవార్తలు): తెలంగాణలో మద్యం దుకాణాల టెండర్ల ప్రక్రియకు అనూహ్యంగా స్వల్ప స్పందన లభిస్తోంది. దరఖాస్తుల గడువు ముగింపునకు ఒక్క రోజే మిగిలి ఉన్నప్పటికీ, ఆశించిన స్థాయిలో స్పందన రాకపోవడంతో ఎక్సైజ్ శాఖ అధికారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పరిస్థితి ఎంతగా దిగజారిందంటే, దరఖాస్తులు పెంచేందుకు గాను.... గతంలో లైసెన్సులు పొందిన వారికి స్వయంగా సందేశాలు(ఎస్ఎంఎస్) పంపి మరీ దరఖాస్తు చేసుకోవాలని కోరుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2,620 మద్యం దుకాణాల లైసెన్సుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. రేపటితో ఈ గడువు ముగియనుంది. అయితే, గురువారం నాటికి కేవలం 25 వేల దరఖాస్తులు మాత్రమే వచ్చినట్లు ఎక్సైజ్ శాఖ వర్గాలు తెలిపాయి. బుధవారం వరకు 9,600 దరఖాస్తులు రాగా, గురువారం ఒక్కరోజే 10 వేల దరఖాస్తులు వచ్చాయి.

# సింగరేణి కార్మికులకు డబుల్ ధమాకా

**ఖాతాల్లోకి దీపావళి బోనస్ జమ**

**ఒక్కొక్కరి ఖాతాలో రూ. 1.03 లక్షల బోనస్ జమ**

**కేంద్రం ప్రకటించిన పర్ఫామెన్స్ లింక్డ్ రివార్డు**

**గతేడాదితో పోలిస్తే రూ. 9,250 అదనపు ప్రయోజనం**



రామగుండం, అక్టోబర్ 17 (ఈవార్తలు): తెలంగాణ సింగరేణి కార్మికులకు పండుగల వేళ డబుల్ ధమాకా తగిలింది. ఇటీవలే దసరా సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి భారీ బోనస్ అందుకున్న వారికి, ఇప్పుడు దీపావళి కానుకగా కేంద్ర ప్రభుత్వం నుంచి మరో పెద్ద మొత్తం అందింది. కేంద్రం ప్రకటించిన పర్ఫామెన్స్ లింక్డ్ రివార్డు (పీఎల్ఆర్) కింద ఒక్కో కార్మికుడికి రూ. 1.03 లక్షల బోనస్ ఈరోజు వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన కోల్ ఇండియా ఏటా అందించే ఈ పీఎల్ఆర్ బోనస్, ఈసారి రికార్డు స్థాయిలో ఉంది. గత ఏడాదితో పోలిస్తే రూ. 9,250 పెంచి, ఒక్కొక్కరికి రూ. 1.03 లక్షలు చెల్లిస్తున్నారు. కోల్ ఇండియా చరిత్రలోనే కార్మికులకు ఇంత భారీ మొత్తంలో పీఎల్ఆర్ బోనస్ ప్రకటించడం ఇదే ప్రథమం కావడం విశేషం. 2010-11 ఆర్థిక సంవత్సరంలో కేవలం రూ. 21,000గా ఉన్న ఈ బోనస్, క్రమంగా పెరుగుతూ ఈ ఏడాది లక్ష రూపాయల మార్కును దాటింది. నెల రోజుల వ్యవధిలోనే సింగరేణి కార్మికులు రెండు భారీ బోనస్‌లు అందుకోవడంతో వారిలో ఆనందం వెల్లివిరుస్తోంది. దసరా పండుగ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం సంస్థ లాభాల్లో 34 శాతం వాటాను కార్మికులకు పంచాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం మేరకు 41,000 మంది శాశ్వత ఉద్యోగులకు ఒక్కొక్కరికి రూ. 1.95 లక్షలకు పైగా దసరా కానుకగా అందించింది. దీనికి అదనంగా ఇప్పుడు కేంద్రం నుంచి దీపావళి బోనస్ కూడా రావడంతో కార్మికులు పండుగలను మరింత ఉత్సాహంగా జరుపుకుంటున్నారు. దసరా బోనస్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చరిత్రలో తొలిసారిగా 30,000 మంది కాంట్రాక్ట్ కార్మికులకు కూడా రూ. 5,500 చొప్పున చెల్లించడం గమనార్హం. కోల్ ఇండియా నుంచి వచ్చే పీఎల్ఆర్ బోనస్‌ను దీపావళికి పంపిణీ చేస్తామని ప్రభుత్వం ముందుగా ప్రకటించిన ప్రకారమే, నేడు ఆ మొత్తాన్ని ఖాతాల్లో జమ చేసింది.



# రిపోర్టులు రావు.. రోగం తగ్గదు!

**15 రోజులైనా అందని మెడికల్ రిపోర్టులు**

**జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో సిబ్బంది నిర్వాకం**

**వచ్చినప్పుడు తీసుకుపో అంటూ దుసురు ప్రవర్తన**

జగిత్యాల టౌన్, అక్టోబర్ 17 (ఈవార్తలు): ఏదైనా రోగమొస్తే.. టెస్టులు రాస్తారు. టెస్టుల ప్రక్రియను బట్టి ఎక్కువలో ఎక్కువ మూడ్రోజుల్లో రిపోర్టులు వస్తాయి. కానీ, జగిత్యాల ప్రభుత్వ దవాఖానలో 15 రోజులైనా రిపోర్టులు అందకపోవడం గమనార్హం. ఇదేంటని సిబ్బందిని అడిగితే.. ఇంకా రాలేదు.. వచ్చినప్పుడు తీసుకుపో అంటూ దురుసుగా ప్రవర్తిస్తున్నారు. అసలేం జరిగిందంటే.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో కొందరు రోగులు 15 రోజుల క్రితం రక్త, మూత్ర పరీక్షలకు శాంపిల్స్ ఇచ్చారు. అప్పటి నుంచి ప్రతి రోజూ ల్యాబ్‌కు వచ్చి రిపోర్టుల గురించి అడిగినా, ఇంకా రాలేదన్న సమాధానమే వచ్చింది. ఆ రిపోర్టులు వస్తే గానీ, డాక్టరు రోగమేంటో చెప్పలేని పరిస్థితి. రోగమేంటో తెలిస్తేనే మందులు రాయాలి. ఆ మందులు వేసుకుంటేనే రోగం తగ్గేది. కానీ.. వారాల తరబడి రిపోర్టులు అందక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్తే జేబులు గుల్ల చేస్తారు. ప్రభుత్వ దవాఖానలో చూపించుకుందామంటే ఇదీ పరిస్థితి అంటూ రోగులు, రోగుల సహాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ‘ఈవార్తలు’ ప్రతినిధి టీ హబ్ మెడికల్ ల్యాబ్ మేనేజర్‌ను సంప్రదించగా.. తమ వద్దకు వచ్చిన శాంపిల్స్‌కు వెంటవెంటనే రిపోర్టులను సంబంధిత ఆసుపత్రులకు పంపిస్తున్నామనిచెప్తున్నారు. రోగులేమో తమకు ఇంకా రిపోర్టులు అందలేదని పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, సమస్యను పరిష్కరించాలని రోగులు వేడుకుంటున్నారు.

## శిశు మరణాలపై సమీక్ష

శిశు మరణాలపై జిల్లా వైద్యాధికారి డాక్టర్ కే ప్రమోద్ కుమార్ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 2025 ఏప్రిల్ 1 నుంచి ఇప్పటివరకు జరిగిన 10 మంది చిన్నపిల్లల మరణాలపై డెత్ ఆడిట్ నిర్వహించారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు సమీక్ష సమావేశంలో పాల్గొని మరణాల నివేదికలను సమర్పించారు. ప్రతి ఒక కేసును క్షుణ్ణంగా విచారించి పలు సూచనలు చేశారు. ఎక్కువగా ప్రీ టర్మ్ బేబీస్, కన్జెంటల్ హార్ట్ డిసీజెస్, ఆస్పిరేషన్ కేసులు ఉన్నాయి. కార్యక్రమంలో చైల్డ్ డెత్ రివ్యూ కమిటీ మెంబర్స్ ప్రోగ్రాం ఆఫీసర్ చైల్డ్ హెల్త్ ఇమ్యునైజేషన్ డాక్టర్ ఏ శ్రీనివాస్, జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ ఎన్ శ్రీనివాస్, మాతాశిశు సంరక్షణ అధికారి డాక్టర్ జైపాల్ రెడ్డి, డాక్టర్ అర్చన, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ అర్జున్, గైనకాలజిస్ట్ డాక్టర్ హరిత పవన్, మత్తు వైద్య నిపుణుడు డాక్టర్ సుధీర్, మండలంలోని వైద్యాధికారులు, హెల్త్ ఎడ్యుకేటర్ తరాల శంకర్, హెచ్ఈఓ రాజేశం, ఆరోగ్య పర్యవేక్షకుడు శ్రీనివాస్ తదితరులుపాల్గొన్నారు.

# సన్న, దొడ్డు వడ్లకు వేర్వేరు కేంద్రాలు

## ప్రణాళికాబద్ధంగా ధాన్యం కొనుగోళ్లు జరగాలి.. అధికారులతో కలెక్టర్ సత్యప్రసాద్ సమీక్ష

జగిత్యాల టౌన్, అక్టోబర్ 17 (ఈవార్తలు): జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ప్రణాళికాబద్ధంగా జరిగేలా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం సంబంధిత అధికారులతో ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించిన ఆయన.. సన్న, దొడ్డు వడ్లకు వేర్వేరుగా కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లాలో ప్రారంభించాలని, ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద అవసరమైన మేరకు టార్పాలిన్ కవర్లు, గన్ని బ్యాగుల, వెయింగ్ యంత్రాలు, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, ఇతర సామాగ్రి సిద్ధం చేసుకోవాలని, కొనుగోలు సిబ్బందికి అవసరమైన మేరకు శిక్షణ అందించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు కాంట చేయాలని ఎదురుచూసే పరిస్థితి రాకుండా చూడాలని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే వివరాలు ట్యాబ్ ఎంట్రీ జరిగేలా సిబ్బంది నియమించుకోవాలని తెలిపారు. 2025 వానకాలం సీజన్ ధాన్యం నగదు, బోనస్ నగదు 48 నుంచి 72 గంటల లోగా రైతులకు ఖాతాలలో జమ చేసేందుకు ప్రభుత్వం చర్యలు




చేపట్టిందని తెలిపారు. గత సీజన్ అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుత సీజన్ మరింత మెరుగ్గా ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేయాలని అన్నారు. వ్యవసాయ శాఖతో సమన్వయం చేసుకుంటూ జిల్లాలో కొనుగోలు కేంద్రాలను వరి కోతల కంటే ముందుగానే ప్రారంభించాలని అన్నారు. దీపావళి తర్వాత వరి కోతలు వేగం కానున్న నేపథ్యంలో జిల్లాల్లో గన్ని బ్యాగుల, ధాన్యం రవాణా ఏర్పాట్లు, ధాన్యం సెంటర్ లలో ఇన్ ఫ్రా సౌకర్యాల కల్పన పై చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు క్రమ పద్ధతిలో జరిగేలా ఏర్పాట్లు చేసి సన్నద్ధంగా ఉండాలని అన్నారు. లోతట్టు ప్రాంతాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించవద్దని, ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద అవసరమైన వస్తువులు కల్పించాలని అన్నారు. సన్న రకం, దొడ్డు రకం ధాన్యం కొనుగోలు వేర్వేరు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఒకే చోట కొనుగోలు చేస్తే రైతులకు స్పష్టంగా తెలిసేలా ప్రత్యేక కౌంటర్లు పెట్టాలని, సన్న రకం, దొడ్డు రకం ధాన్యాన్ని వేర్వేరుగా రవాణా చేయాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కన్నం హరిణి తదితరులు పాల్గొన్నారు.



## బల్వంతాపూర్‌లో యూబీఐ అవగాహన సదస్సు

మల్యాల, అక్టోబర్ 17 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం బల్వంతాపూర్ గ్రామంలో యూనియన్ బ్యాంక్ అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలపై మహిళలు, గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హులైనవారికి పథకాలలో పేరు నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో మల్యాల యూనియన్ బ్యాంక్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## ప్రతి కార్యకర్తకు గుర్తింపు

**జగిత్యాలలో మంత్రి అడ్లూరి వెల్లడి.. సంఘటన్ సృజన్ అభియాన్ సమావేశం నిర్వహణ**

జగిత్యాల టౌన్, అక్టోబర్ 17 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ డీసీసీ అధ్యక్ష నియామక ప్రక్రియలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఏబీ గార్డెన్స్‌లో ‘సంఘటన్ సృజన్ అభియాన్’ పేరుతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరై.. పార్టీ బలోపేతానికి అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాల ప్రకారం ప్రతి కార్యకర్తకు గుర్తింపు దక్కేలా, సమిష్టిగా పార్టీని మరింత బలపరచాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ పునర్నిర్మాణ దిశగా పార్టీ హైకమాండ్ తీసుకుంటున్న చర్యలకు తాము కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐసీసీ పరిశీలకులు జై కుమార్, పీసీసీ పరిశీలకులు ఫక్రుద్దీన్ రాయ్, కేతురి వెంకటేశ్, బాసిత్ పాల్గొని డీసీసీ అధ్యక్ష నియామక ప్రక్రియపై స్థానిక నాయకులతో చర్చించారు. ఈ సమావేశంలో మాజీమంత్రి జీవన్ రెడ్డి, కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు, జిల్లా కాంగ్రెస్ నాయకులు, మండల అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ ప్రతినిధులు, యువజన, మహిళా, రైతు, మైనారిటీ విభాగాల నేతలుపాల్గొన్నారు.



## బీసీ బంద్‌ను విజయవంతం చేద్దాం: రాజ్ కుమార్

పెగడపల్లి, అక్టోబర్ 17 (ఈవార్తలు): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని చేపట్టిన బీసీ బంద్‌ను విజయవంతం చేయాలని జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల జాతీయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నీరటి రాజ్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. జనాభా ప్రకారం బీసీలు 65 శాతం ఉన్నందున వారికి 65% రిజర్వేషన్ ఇవ్వాలని బీసీల తరఫున డిమాండ్ చేస్తున్నామని అన్నారు. మండలంలోని బీసీ కుల బంధువులంతా బంద్‌లో పాల్గొనాలని కోరారు. వ్యాపార సముదాయాలు, పాఠశాలలు మూసేసి బంద్‌కు మద్దతు తెలపాలని విన్నవించారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు చెట్ల రాజు, కోశాధికారి గంగుల కొమురెల్లి, కార్యదర్శి పుల్కం జలపతి, బీసీ సీనియర్ నాయకులు చిందం తిరుపతి, ముల్క రాజేశం, చింతకింది కిశోర్ తదితరులుపాల్గొన్నారు.



## ఉన్నత విద్యే భవిష్యత్తుకు బాటలు

**జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్.. కస్తూర్బ గాంధీ బాలికల విద్యాలయం ఆకస్మిక తనిఖీ**

ధర్మపురి, అక్టోబర్ 17 (ఈవార్తలు): ఉన్నతవిద్యే భవిష్యత్తుకు బాటలు వేస్తుందని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. శుక్రవారం ధర్మపురి పట్టణంలోని కస్తూర్బ గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్య పట్ల శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం భోజనం నిర్వహణను, వంట సరుకుల నాణ్యతను, స్టోర్ రూమ్‌లోని బియ్యం నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారం, శుభ్రమైన వాతావరణంలోనే విద్యార్థులకు వంట చేయాలని వంటమనిషికి సూచించారు. పాఠశాలలో ఉన్నటువంటి ఖాళీ స్థలంలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని పాఠశాల నిర్వాహకులకు సూచించారు . విద్యాలయం చుట్టూ ఉన్న పరిసరాల శుభ్రతను పరిశీలించారు.విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కలెక్టర్ వెంట జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, డీఈవో కే రాము, ధర్మపురి తహసీల్దార్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




## రైతులకు ఉచితంగా కోడెల పంపిణీ

వేములవాడ, అక్టోబర్ 17 (ఈవార్తలు): వేములవాడ పట్టణం తిప్పాపూర్‌లోని శ్రీ రాజరాజేశ్వర స్వామి గోశాలలో రైతులకు ఉచిత కోడెల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ‘దేశంలో ఎక్కడా లేనివిధంగా రాజన్న ఆలయంలో స్వామి వారికి కోడెను కట్టే సంస్కృతి వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి సన్నిధిలో ఉంది. తిప్పాపూర్ గోశాలలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రైతులకు ఉచిత కోడెలను పంపిణీ చేస్తున్నాం. రైతులకు నేరుగా కోడెలను పంపిణీ చేయడం వలన వ్యవసాయానికి ఉపయోగిస్తున్నారు. రైతులు కోడెలను సంరక్షించే బాధ్యత తీసుకోవాలి. రైతులకు పంపిణీ చేసిన కోడెలను పరిశీలిస్తాం. కోడెలను ఇతర అవసరాలకు ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. వేములవాడలో అధునాతన సౌకర్యాలతో 40 ఎకరాల్లో సువిశాల స్థలంలో గోశాల నిర్మాణం చేపట్టాం. అనువైన స్థలాన్ని ఎంపిక చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం’ అని పేర్కొన్నారు.

## మేడిపల్లి గురుకులంలో అడిషనల్ కలెక్టర్ తనిఖీ

మేడిపల్లి, అక్టోబర్ 17 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలకేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ కళాశాల(బాలురు)ను అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాజాగౌడ్ పరిశీలించారు. గురుకులంలో బోధన, వసతుల గురించి ఆరా తీశారు. వంటగది, భోజనశాలను పరిశీలించారు. మరోవైపు, మండలకేంద్రంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు.





## ధన్వంతరి ఆలయంలోన కుంకుమ పూజలు

జగిత్యాల టౌన్, అక్టోబర్ 17 (ఈవార్తలు): జగిత్యాల పట్టణం చింతకుంటలోని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయంలో శుక్రవారం కుంకుమ పూజలు జరిగాయి. మహిళలు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన, లలిత సహస్ర నామాల స్తోత్ర పారాయణం చేశారు. కార్యక్రమంలో దేవాలయ ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ వడ్లగట్ట రాజన్న, వొడ్నాల శ్రీనివాస్, మహిళా సమితి సభ్యులు వొడ్నాల లత, వడ్లగట్ట స్వాతి, భారతాల గీత, సంధ్య, అన్నపూర్ణ, భాగ్య, వాణి, రమాదేవి, చంద్రకళ, త్రివేణి, సునీత, అర్చన, గంగమ్మ, అర్చకుడు నరేశ్ తదితరులుపాల్గొన్నారు.



# బీసీలకు రాజ్యాంగ ఫలాలు అందడం లేదు

## బీసీ సాధికారత సంఘం నేత పొలాస నరేందర్

వేములవాడ, అక్టోబర్ 17 (ఈవార్తలు): స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి బీసీలు అణచివేతకు గురయ్యారని, రాజ్యాంగ ఫలాలు అందుకోలేకపోయారని ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సాధికారత సంఘం అధ్యక్షుడు పొలాస నరేందర్ అన్నారు. శనివారం చేపట్టిన బీసీ బంద్‌కు మద్దతుగా గురువారం మున్నూరు కాపు సంఘం భవనంలో బీసీ జేఏసీ, అఖిలపక్షం నేతల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు దక్కితీరాలని అన్నారు. ఈ నేపథ్యంలో శనివారం తలపెట్టిన బంద్‌కు అన్ని వర్గాలు మద్దతు ఇవ్వాలని కోరారు. వేములవాడ బంద్‌ను విజయవంతం చేయాలని.. వ్యాపార సంస్థలు, హోటళ్లు, సినిమా థియేటర్లు బంద్ పాటించాలని విన్నవించారు. ఈ సమావేశంలో బొజ్జ కనుకయ్య, రాపెల్లి శ్రీధర్, ఇప్పపూల అజయ్, సిహెచ్ రామస్వామి గౌడ్, బత్తుల మహేందర్, చాకినాల అమర్, కొండ కనుకయ్య, రామతీర్థపు రాజు, నిమ్మశెట్టి విజయ్, నరాల శేఖర్, నీలం శేఖర్, వాసం మల్లేష్ యాదవ్, ఇళ్ళందుల వెంకటేశ్, నామాల పోశెట్టి, ఉయ్యాల భూమయ్య గౌడ్, పొనిశెట్టి శంకర్, చకినాల అంజయ్య, తూము రాజు, తిరుపతి తదితరులుపాల్గొన్నారు.

# పాక్‌లో కొత్త కూటమి

**ప్రభుత్వానికి వ్యతిరేకంగా మతపరమైన కూటమి.. 'అహ్లె-ఇ-సున్నత్ పాకిస్థాన్' కూటమికి టీఎల్‌పీ నాయకత్వం.. మద్దతు ప్రకటించిన మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ పార్టీ**

ఇస్లామాబాద్: అంతర్గత, బాహ్య సమస్యలతో సతమతమవుతున్న పాకిస్థాన్ ప్రభుత్వానికి మరో కొత్త, భారీ తలనొప్పి వచ్చిపడింది. పలు మతపరమైన సంస్థలు, మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ పార్టీ ఏకమై ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించేందుకు సిద్ధమవుతుండటంతో దేశంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వివరాల్లోకి వెళితే, తెహ్రీక్-ఎ-లబ్బైక్ పాకిస్థాన్ (టీఎల్‌పీ) నేతృత్వంలో 'అహ్లె-ఇ-సున్నత్ పాకిస్థాన్' పేరుతో పలు మతపరమైన సంస్థలు ఒక కూటమిగా ఏర్పడ్డాయి. గతవారం మురిద్కేలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమ కార్యకర్తలను భద్రతా దళాలు దారుణంగా హత్య చేశాయని ఈ కూటమి ఆరోపిస్తోంది. ఈ ఘటనకు నిరసనగా, అరెస్ట్ చేసిన తమ సభ్యులందరినీ బేషరతుగా విడుదల చేయాలని, ఆ తర్వాతే ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని కూటమి డిమాండ్ చేస్తోంది. ఈ కూటమికి మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని పాకిస్థాన్ తెహ్రీక్-ఎ-ఇన్సాఫ్ (పీటీఐ) మద్దతు ప్రకటించడం ప్రభుత్వ ఆందోళనను రెట్టింపు చేసింది. ప్రభుత్వంతో తీవ్ర విభేదాలతో ఉన్న ఇమ్రాన్ ఖాన్, ఈ నిరసనలకు మద్దతు ఇవ్వాలని, ప్రదర్శనల్లో పాల్గొనాలని తన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దీనికి తోడు, ఖైబర్ పఖ్తుంఖ్వా ముఖ్యమంత్రి సోహైల్ ఖాన్ అఫ్రిది కూడా ఈ ఉద్యమానికి సంఘీభావం ప్రకటించడం గమనార్హం. ఈ నెల 22న జరగనున్న సమావేశం తర్వాత దేశవ్యాప్తంగా భారీ ఎత్తున ధర్నాలు, నిరసన ప్రదర్శనలు చేపట్టాలని కూటమి యోచిస్తోంది. ఇప్పటికే వేలాది మంది ప్రజల మద్దతు



కూడగట్టుకున్న ఈ కూటమి పిలుపుతో పాకిస్థాన్ అట్టుడికేలా కనిపిస్తోంది. దీంతో అప్రమత్తమైన పంజాబ్ ప్రభుత్వం, ముందుజాగ్రత్త చర్యగా ప్రావిన్స్‌లో 144 సెక్షన్ విధించి, సభలు, సమావేశాలు, ర్యాలీలపై నిషేధం విధించింది. ఓవైపు ఆఫ్ఘన్ తాలిబన్లతో చర్చలు, మరోవైపు తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ఉగ్రవాదులు, బలూచిస్థాన్ వేర్పాటువాదులు, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో స్థానికుల నిరసనలతో పాక్ ఇప్పటికే ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఇప్పుడు ఈ కొత్త కూటమి రూపంలో మరో పెద్ద అంతర్గత ముప్పు ఏర్పడింది. ఈ పరిణామాలను భారత నిఘా వర్గాలు నిశితంగా గమనిస్తున్నాయని, నిరసనలు హింసాత్మకంగా మారే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. భద్రతా దళాలు బలప్రయోగానికి దిగితే, ఉద్యమం మరింత ఉద్ధృతమై దేశవ్యాప్తంగా విస్తరించే ప్రమాదం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఆరెస్సెస్ ఉత్సవాలకు హాజరు!

**కర్ణాటక అధికారులకు నోటీసులు**

బెంగళూరు: ఆరెస్సెస్ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న అధికారులకు ప్రభుత్వం షోకాజ్ నోటీసులు జారీ చేసిందని, వారిని సస్పెండ్ చేసే అవకాశాలు ఉన్నాయని వచ్చిన వార్తలను కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే ధృవీకరించారు. తన శాఖలో ఆరెస్సెస్ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న ఉద్యోగులకు నోటీసులు ఇచ్చినట్లు స్పష్టం చేశారు. ఎవరి సిద్ధాంతాలు వారికి ఉండవచ్చని, కానీ ప్రభుత్వ ఉద్యోగులు రాష్ట్ర నిబంధనలు పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. ఆరెస్సెస్, బీజేపీ జన సమీకరణ పేరుతో సమాజాన్ని విషపూరితం చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ ప్రాంగణాల్లో ఇక నుంచి ఎలాంటి సమావేశాలను నిర్వహించరాదని కర్ణాటక మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సంస్థల సమావేశాలు నిర్వహించకూడదని తాను ముఖ్యమంత్రికి లేఖ రాశానని ఖర్గే తెలిపారు. అందుకు అనుగుణంగా ప్రభుత్వ సంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో సమావేశాలకు సంబంధించిన కొత్త నిబంధనలను అమల్లోకి తెస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. ఇక నుంచి ఎలాంటి సమీకరణాలకు, సమావేశాలకైనా ముందస్తుగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని అన్నారు. అందుకు భిన్నంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మహాత్మాగాంధీ వంటి గొప్ప వ్యక్తులనే ఆరెస్సెస్, బీజేపీ వాళ్లు లెక్కచేయనప్పుడు ఇక తాను ఎంత అని ప్రశ్నించారు. ప్రధాన అంశాల నుంచి దారి మళ్లించేందుకు బీజేపీ వ్యక్తిగత దాడులకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. తనను వ్యక్తిగతంగా నిందించడానికి బదులు ఆరెస్సెస్ తరఫున ఎందుకు మాట్లాడుతున్నారో బీజేపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆరెస్సెస్ తరఫున మాట్లాడేందుకు వాళ్లెవరు.. తనను తాను సమర్థించుకోలేదా? అని ప్రశ్నించారు. ఆరెస్సెస్ కార్యక్రమాల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రభుత్వ అధికారులు మాట్లాడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ అధికారులు తటస్థంగా ఉండటాన్ని తప్పనిసరి చేస్తూ కర్ణాటక స్టేట్ సివిల్ సర్వీసెస్ రూల్స్-2021ను అమలు చేయాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను ఆయన కోరారు. ఇది తాను పెట్టిన నిబంధన కాదని, కర్ణాటక సివిల్ సర్వీసెస్ నిబంధన అని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ సంస్థలతో సంబంధం ఉన్న ఎలాంటి కార్యక్రమాల్లో పాల్గొనరాదనే ఆ నిబంధన చెబుతోందని అన్నారు.

## 2026.. బంగారం 1.5 లక్షలు

**గత ధంతేరాస్ నుంచి ఇప్పటికి 63 శాతం పెరుగుదల.. అమెరికా-చైనా ఉద్రిక్తతలతో పెరుగుతున్న డిమాండ్**

న్యూఢిల్లీ: బంగారం ధర రానున్న రోజుల్లో మరింత పెరిగి సామాన్యులకు షాక్ ఇచ్చేలా ఉంది. 2026 నాటికి 10 గ్రాముల పసిడి ధర రూ.1.5 లక్షల మార్కును తాకే అవకాశం ఉందని ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ వెంచురా సెక్యూరిటీస్ ఓ నివేదికలో సంచలన అంచనా వేసింది. శుక్రవారం విడుదల చేసిన ఈ నివేదిక ప్రకారం, అంతర్జాతీయంగా నెలకొన్న సానుకూల పరిస్థితులు పసిడికి భారీగా కలిసొస్తున్నాయి. గత ఏడాది ధంతేరాస్ (2024) నుంచి ఈ ధంతేరాస్ (2025) నాటికి బంగారం ధరలు ఇప్పటికే ఆకాశాన్నంటాయి. రూపాయి పరంగా చూస్తే సుమారు 63 శాతం, డాలర్లలో అయితే 53 శాతం రాబడిని ఇచ్చింది. గతేడాది ధంతేరాస్ నాడు రూ.78,840గా ఉన్న తులం బంగారం ధర, ప్రస్తుతం రూ.1,28,200కు చేరడం గమనార్హం. ఇదే జోరు కొనసాగితే, 2026 నాటికి అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు బంగారం ధర 5000 డాలర్లకు, దేశీయంగా తులం రూ.1,50,000కు చేరుతుందని నివేదిక స్పష్టం చేసింది. బంగారం ధరల పెరుగుదలకు అనేక అంతర్జాతీయ అంశాలు దోహదం చేస్తున్నాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించవచ్చని సంకేతాలివ్వడం, కేంద్ర బ్యాంకులు పెద్ద ఎత్తున బంగారాన్ని కొనుగోలు చేయడం, ఈటీఎఫ్‌లలోకి పెట్టుబడుల ప్రవాహం పెరగడం వంటివి పసిడికి డిమాండ్ పెంచుతున్నాయి. వెంచురా సెక్యూరిటీస్ కమోడిటీస్ హెడ్ ఎన్.ఎస్. రామస్వామి మాట్లాడుతూ, "అమెరికాలో ప్రభుత్వం షట్‌డౌన్‌లో ఉన్నందున ఆర్థిక గణాంకాలు ఆలస్యమవుతున్నాయి. ఈ క్రమంలో, యూఎస్ కార్మిక మార్కెట్‌లో నెలకొన్న ప్రతికూలతల దృష్ట్యా ఫెడ్ ఛైర్మన్ మరోసారి వడ్డీ రేట్లను తగ్గించే అవకాశముందని



సంకేతాలిచ్చారు" అని తెలిపారు. మరోవైపు, అమెరికా జాతీయ రుణం 37 ట్రిలియన్ డాలర్లకు చేరడం కూడా ఆ దేశ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెంచుతోందని ఆయన వివరించారు. ఇక చైనా-అమెరికా మధ్య ముదురుతున్న వాణిజ్య యుద్ధం కూడా బంగారం ధరకు రెక్కలు తొడుగుతోంది. అరుదైన భూలోహాల ఎగుమతులపై చైనా ఆంక్షలు విధించగా, చైనా దిగుమతులపై అమెరికా అదనంగా 100 శాతం సుంకం విధించింది. ఈ పరిణామాలతో పెట్టుబడిదారులు సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు మొగ్గుచూపుతున్నారు. ఫలితంగా, గత ఎనిమిది వారాలుగా బంగారం ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ధర తగ్గినా కూడా ఇన్వెస్టర్లు దూకుడుగా కొనుగోళ్లు జరుపుతున్నారని నివేదిక పేర్కొంది.

## 24 గంటల్లో పార్శిల్ డెలివరీ

**కేంద్ర టెలికాం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా వెల్లడి**

న్యూఢిల్లీ: భారత తపాలా శాఖ తన సేవలను ఆధునికీకరించే దిశగా ఒక భారీ ముందడుగు వేస్తోంది. ప్రైవేట్ కొరియర్ సర్వీసులకు దీటుగా, దేశంలో ఏ మూలకైనా కేవలం 24 గంటల్లో పార్శిళ్లను చేరవేసే కొత్త విధానాన్ని తీసుకురానుంది. 2026 జనవరి నాటికి ఈ సరికొత్త స్పీడ్ డెలివరీ సేవలను దేశవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకువస్తామని కేంద్ర టెలికాం శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా శుక్రవారం ప్రకటించారు. ప్రస్తుతం ఇండియా పోస్ట్ ద్వారా వేగంగా పంపినా, పార్శిల్ చేరడానికి మూడు నుంచి ఐదు రోజుల సమయం పడుతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా మంత్రి సింధియా మరిన్ని వివరాలు వెల్లడించారు. దేశంలోని అన్ని మెట్రో నగరాలు,




రాష్ట్ర రాజధానుల్లో 48 గంటల్లో గ్యారెంటీ డెలివరీ సేవలను కూడా 2026 జనవరి నాటికి ప్రారంభిస్తామని తెలిపారు. అంతేకాకుండా, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ప్రముఖ ఈ-కామర్స్ సంస్థలతో కలిసి పనిచేయనున్నట్లు స్పష్టం చేశారు. 2026 మార్చి నాటికి ఈ సంస్థలకు చెందిన వస్తువులను వినియోగదారుల ఇళ్లకు చేర్చే 'లాస్ట్-మైల్ డెలివరీ' సేవలను కూడా ఇండియా పోస్ట్ అందిస్తుందని ఆయన వివరించారు. ఇటీవలే, దాదాపు రెండు నెలల విరామం తర్వాత అమెరికాకు అన్ని రకాల అంతర్జాతీయ పోస్టల్ సేవలను అక్టోబర్ 15 నుంచి తపాలా శాఖ తిరిగి ప్రారంభించింది. దేశవ్యాప్తంగా సుమారు 1,64,999 పోస్టాఫీసులతో ప్రపంచంలోనే అతిపెద్ద నెట్‌వర్క్‌లలో ఒకటిగా ఇండియా పోస్ట్ కొనసాగుతోంది. ఈ విస్తృతమైన నెట్‌వర్క్ కారణంగా దేశంలోని ప్రతి గ్రామానికి 5 కిలోమీటర్ల పరిధిలోనే ఒక పోస్టాఫీసు అందుబాటులో ఉందని ప్రభుత్వం చెబుతోంది. ఈ కొత్త సేవలతో పొదుపు, బీమా, ప్రభుత్వ పథకాలతో పాటు ఆధునిక డిజిటల్ సేవలు కూడా మారుమూల ప్రాంతాల ప్రజలకు మరింత చేరువ కానున్నాయి.

## పాపం.. పక్కింటోడికి దెబ్బలు!

**భార్య ప్రియుడనుకుని చితకబాదిన భర్త**

**తాను కలిసింది వేరే వ్యక్తినంటూ భార్య ట్విస్ట్**

ఝాన్సీ: ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీలో ఒక సినిమాను తలపించే ఘటన వెలుగు చూసింది. తన భార్య మరొక వ్యక్తితో హోటల్‌లో ఉందన్న సమాచారంతో రగిలిపోయిన ఓ భర్త.. అక్కడ కనిపించిన ఓ అమాయకుడిని ప్రియుడిగా పొరబడ్డాడు. స్నేహితులతో కలిసి అతడిని కిడ్నాప్ చేసి, ఇనుప రాడ్లతో దారుణంగా కొట్టి తీవ్రంగా గాయపరిచాడు. అయితే, కథలో ఊహించని మలుపు ఏమిటంటే, ఆ వ్యక్తి నిరపరాధి అని, అసలు తన ప్రియుడు వేరొకరు అని భార్య చెప్పడంతో విషయం మరింత సంక్లిష్టంగా మారింది. వివరాల్లోకి వెళితే, ఝాన్సీలోని మౌరానిపూర్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తికి తన భార్య ప్రియుడితో కలిసి స్థానిక హోటల్‌లో ఉందన్న సమాచారం అందింది. దీంతో ఆగ్రహంతో ఊగిపోయిన అతను, తన స్నేహితులతో కలిసి ఆ హోటల్‌కు వెళ్లాడు. అదే సమయంలో, సోను అనే యువకుడు ఓ పని మీద హోటల్‌కు వచ్చాడు. హోటల్ నుంచి బయటకు వెళ్లేందుకు సదరు మహిళ సోను సహాయం కోరింది. సరిగ్గా అప్పుడే అక్కడికి చేరుకున్న భర్త, సోనునే తన భార్య ప్రియుడని అపార్థం చేసుకున్నాడు. అసలు ప్రియుడు ఆ గందరగోళంలో అక్కడి నుంచి తప్పించుకున్నాడు. భర్త, అతని స్నేహితులు సోనును బలవంతంగా తమ దుకాణానికి తీసుకెళ్లి ఇనుప రాడ్లతో చితకబాదారు. ఈ దాడిలో సోనుకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకుని అక్కడికి వచ్చిన సోను తండ్రి, సోదరుడిపై కూడా వారు దాడికి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న మౌరానిపూర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. "అపార్థం కారణంగానే రాజేశ్, ముఖేశ్ మరికొందరు కలిసి ప్రమోద్‌పై దాడి చేశారని ప్రాథమికంగా తెలిసింది" అని మౌరానిపూర్ సీఓ మనోజ్ కుమార్ తెలిపారు. తాను కేవలం సహాయం చేయబోతే తనపై దాడి జరిగిందని బాధితుడు సోను పోలీసులకు వాంగ్మూలం ఇచ్చాడు. అయితే, ఈ కేసులో అసలు ట్విస్ట్ నిందితుడి భార్య స్టేట్‌మెంట్‌తో బయటపడింది. "నాకు సోనుతో ఎలాంటి సంబంధం లేదు. నేను కలవడానికి వెళ్లిన వ్యక్తి వేరే అతను. నా భర్త పొరపాటున మా పక్కింట్లో ఉండే సోనును అపార్థం చేసుకున్నాడు" అని ఆమె పోలీసులకు చెప్పింది. ఈ అనూహ్య ఘటనతో ఓ నిరపరాధి ఆసుపత్రి పాలవ్వగా, పోలీసులు కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు.


## కొట్టుకున్న వందే భారత్ సిబ్బంది

న్యూఢిల్లీ: ఢిల్లీలోని నిజాముద్దీన్ రైల్వే స్టేషన్‌లో గ్వాలియర్‌కు వెళుతున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ సిబ్బంది ప్లాట్‌ఫాంపై డస్ట్‌బిన్‌లు, బెల్టులతో కొట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో విధులు నిర్వహిస్తున్న పలువురు సిబ్బంది పరస్పరం దాడికి దిగారు. ఈ వీడియో 1 నిమిషం 19 సెకన్ల నిడివి కలిగి ఉంది. రైలు బయలుదేరడానికి కొద్ది ముందు ఈ ఘర్షణ జరగడం ప్రయాణికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈ ఘటనపై ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఉద్యోగుల తీరు భారత రైల్వే ప్రతిష్ఠకు నష్టం చేస్తుందని అంటున్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి వారు భారతీయ రైల్వేల్లో పని చేయడానికి అర్హులు కాదని కొంతమంది అభిప్రాయపడ్డారు. ఈ వీడియోలో సుమారు ఆరు నుంచి ఎనిమిది మంది పరస్పరం దాడి చేసుకున్నారు. కొందరు బెల్టుతో మరొకరిని కొట్టగా, ఇంకొంతమంది అక్కడే ఉన్న చెత్తబుట్టలను తోటి ఉద్యోగుల పైకి విసిరారు. ఈ ఘటనలో ఒకరిద్దరు ఉద్యోగులు కిందపడిపోయారు. ఈ ఘర్షణ జరుగుతుండగా కొంతమంది ప్రయాణికులు దూరంగా నిలబడి చూస్తున్నట్లుగా వీడియోలో ఉంది. రైల్వే రక్షణ దళం సిబ్బంది వచ్చినప్పటికీ, ఆ గొడవ కొనసాగింది.

## ఏఐ నేర్చుకుంటే కొలువుకు ఢోకా లేదు

**డెలాయిట్ గ్లోబల్ ఏఐ లీడర్ నితిన్ మిట్టల్**

న్యూఢిల్లీ/డెహ్రాడూన్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మన ఉద్యోగాలను లాక్కుంటుందని ఆందోళన చెందడం కంటే, దానిని వేగంగా నేర్చుకుంటూ ముందుకు వెళ్తున్న మన సహోద్యోగుల గురించి ఆందోళన చెందడం మంచిదని డెలాయిట్ గ్లోబల్ ఏఐ లీడర్ నితిన్ మిట్టల్ కీలక వ్యాఖ్యలు చేశారు. అసలైన పోటీ టెక్నాలజీతో కాదని, ఆ టెక్నాలజీని అందిపుచ్చుకున్న తోటి ఉద్యోగులతోనే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఎన్డీటీవీ వరల్డ్ సమ్మిట్ 2025లో పాల్గొన్న ఆయన, "ఏఐ మన ఉద్యోగాలను తీసేస్తుందా?" అనే ప్రశ్నకు సమాధానమిచ్చారు. "సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్, కస్టమర్ సపోర్ట్, కాల్ సెంటర్లు, కోడింగ్ వంటి కొన్ని ఉద్యోగాలపై ఏఐ ప్రభావం తప్పకుండా ఉంటుంది. అయితే ఇప్పటివరకు ఏఐ వల్ల నేరుగా ఒక్క ఉద్యోగం కూడా పోలేదు. ఏఐతో ఎలా పనిచేయాలో తెలుసుకున్న మరో వ్యక్తి వల్లే ఉద్యోగాలు పోతున్నాయి" అని ఆయన వివరించారు. టెక్నాలజీకి అనుగుణంగా తమను తాము మార్చుకోకుండా, కొత్త నైపుణ్యాలు నేర్చుకోవాలనే ఆసక్తి చూపకుండా ఖాళీ సమయంలో సోషల్ మీడియా చూస్తూ గడిపేవారు కచ్చితంగా వెనుకబడిపోతారని మిట్టల్ హెచ్చరించారు. ఉద్యోగాలు కోల్పోతామనే భయాన్ని పక్కనపెట్టి, ఏఐ ద్వారా పుట్టుకొస్తున్న కొత్త ఆర్థిక వ్యవస్థ, అది సృష్టించే సరికొత్త ఉద్యోగాలపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. ఏఐ డేటా సెంటర్ నిర్మాణం వంటి ప్రాజెక్టుల వల్ల నిర్మాణ రంగంలో ఉద్యోగాలు పెరగడంతో పాటు స్థానిక తయారీ రంగానికి కూడా ఊతం లభిస్తుందని ఉదాహరణగా చెప్పారు. భారతదేశ సంస్కృతి, భాషలను కాపాడుకోవడానికి దేశీయంగా సొంత ఏఐ మోడల్స్‌ను అభివృద్ధి చేసుకోవాల్సిన



అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు. ప్రతిభ, ఆవిష్కరణలు, వ్యవస్థాపక స్ఫూర్తి వంటి సహజ ప్రయోజనాలను భారత్ ఉపయోగించుకోవాలని ఆయన తెలిపారు. అమెరికాలోని వేమో సెల్ఫ్ డ్రైవింగ్ క్యాబ్‌ల గురించి అడగ్గా, వాటిని ఇక్కడ నడపగలమా అని చర్చించడం కంటే, భారతదేశానికి అవసరమైన వాటిని ఇక్కడే ఎలా తయారుచేయగలం అనేదానిపై దృష్టి పెట్టాలని ఆయన అభిప్రాయపడ్డారు.



## టీవీకేకు గుర్తింపు లేదు: ఈసీ

న్యూఢిల్లీ: తమిళ నటుడు విజయ్‌కు చెందిన టీవీకే గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ కాదని కేంద్ర ఎన్నికల సంఘం హైకోర్టు ధర్మాసనానికి నివేదించింది. కరూర్‌లో విజయ్ ప్రచార సభలో తొక్కిసలాట జరిగి 41 మంది మృతి చెందడం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ నేపథ్యంలో విజయ్ పార్టీ గుర్తింపును రద్దు చేయడంతో పాటు రాజకీయ పార్టీల ప్రచార సభల్లో మహిళలు, చిన్నారులు పాల్గొనకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మద్రాస్ హైకోర్టులో పలు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. వీటిని సీజే జస్టిస్ ఎంఎం శ్రీవాస్తవ, జస్టిస్ జీ అరుల్ మురుగన్‌ల ధర్మాసనం విచారించింది. ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది నిరంజన్ రాజగోపాల్ కోర్టులో వాదనలు వినిపించారు. టీవీకే పార్టీకి గుర్తింపు లేనందున ఆ పార్టీకి ఆ హోదా రద్దు చేయాలనే అభ్యర్థన నిలబడదని కోర్టుకు తెలిపారు. మరోవైపు, కరూర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించి సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉన్న పిటిషన్లు మినహా ఈ కేసుల విచారణకు ఒక ధర్మాసనాన్ని ఏర్పాటు చేసేందుకు వీలుగా వాటన్నింటినీ హైకోర్టు పాలనా వ్యవహారాల విభాగం ముందు ఉంచాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

## ట్రంప్ సర్కారుకు దెబ్బ!

**కోర్టుకు లాగిన చాంబర్ ఆఫ్ కామర్స్**

**హెచ్-1బీ ఫీజుల పెంపు వల్లే..**

**లక్ష డాలర్ల ఫీజు చట్టవిరుద్ధమని దావా**

వాషింగ్టన్: వలస విధానాలపై దూకుడుగా వ్యవహరించే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న ఒక సంచలన నిర్ణయానికి ఆయన సొంత దేశంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కొత్త హెచ్-1బీ వీసా దరఖాస్తులపై ఏకంగా లక్ష డాలర్ల (సుమారు రూ.88 లక్షలు) ఫీజు విధించాలన్న ఆయన ప్రతిపాదనను సవాలు చేస్తూ, దేశంలోని ప్రముఖ వాణిజ్య సంస్థ 'యూఎస్ చాంబర్ ఆఫ్ కామర్స్' న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఈ మేరకు కొలంబియా జిల్లా కోర్టులో గురువారం దావా దాఖలు చేసింది. ట్రంప్ సర్కార్ నిర్ణయం అమెరికా ఆవిష్కరణలను, పోటీతత్వాన్ని దెబ్బతీసేలా ఉందని, ఇది పూర్తిగా చట్టవిరుద్ధమని తన పిటిషన్‌లో పేర్కొంది. సెప్టెంబర్ 19న ట్రంప్ జారీ చేసిన ఈ ప్రకటన ఇమ్మిగ్రేషన్, జాతీయత చట్టాన్ని ఉల్లంఘిస్తోందని చాంబర్ ఆఫ్ కామర్స్ ఆరోపించింది. వీసాలపై కాంగ్రెస్‌కు ఉన్న అధికారాన్ని అధ్యక్షుడు అతిక్రమించారని స్పష్టం చేసింది. ఈ వ్యాజ్యంలో హోంల్యాండ్ సెక్యూరిటీ, విదేశాంగ శాఖలతో పాటు వాటి కార్యదర్శులను ప్రతివాదులుగా చేర్చింది. ఈ నిర్ణయంపై చాంబర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ నీల్ బ్రాడ్లీ మాట్లాడుతూ, "ఈ భారీ ఫీజు వల్ల స్టార్టప్‌లు, చిన్న, మధ్య తరహా సంస్థలు విదేశీ నిపుణులను నియమించుకోవడం దాదాపు అసాధ్యంగా మారుతుంది" అని ఆందోళన వ్యక్తం చేశారు. అధ్యక్షుడికి విస్తృత అధికారాలు ఉన్నప్పటికీ, కాంగ్రెస్ చేసిన చట్టాలను ఆయన ఉల్లంఘించలేరని చాంబర్ తన వాదన వినిపించింది. హెచ్-1బీ వీసా హోల్డర్లు అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఎంతో మేలు చేస్తున్నారని, వారు కొత్త ఉద్యోగాలు సృష్టించడంతో పాటు అమెరికన్ల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే ఆవిష్కరణలకు కారణమవుతున్నారని తెలిపింది. ట్రంప్ తాజా నిర్ణయం ఈ ప్రగతిని తారుమారు చేస్తుందని హెచ్చరించింది. ఈ నిబంధన వల్ల అత్యధికంగా నష్టపోయేది భారతీయ నిపుణులే. ఇటీవలి కాలంలో జారీ అయిన మొత్తం హెచ్-1బీ వీసాలలో 71 శాతం భారతీయులవే కావడం గమనార్హం. ఒకవైపు అమెరికా ఇలాంటి కఠిన నిబంధనలు విధిస్తుండగా, మరోవైపు చైనా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులను ఆకర్షించేందుకు 'కే-వీసా' పేరుతో కొత్త వర్క్ పర్మిట్‌ను ప్రకటించడం అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారింది.

## 52 వారాల గరిష్ఠానికి సూచీలు

ముంబై: పండగ సీజన్‌కు స్వాగతం పలుకుతూ దేశీయ స్టాక్ మార్కెట్లు సరికొత్త శిఖరాలను అధిరోహించాయి. వరుసగా మూడో రోజు శుక్రవారం కూడా సూచీలు లాభాల బాటలో పయనించి, 52 వారాల గరిష్ఠ స్థాయిలను నమోదు చేశాయి. ఫైనాన్షియల్, ఆటో, ఎఫ్ఎంసిజి రంగాల షేర్లలో వెల్లువెత్తిన కొనుగోళ్ల మద్దతుతో మార్కెట్లు పరుగులు పెట్టాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 484.53 పాయింట్లు లాభపడి 83,952.19 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 124.55 పాయింట్లు పెరిగి 25,709.85 వద్ద ముగిసింది. ఎఫ్ఎంసీజీ రంగం 1.37 శాతం వృద్ధితో టాప్ పెర్ఫార్మర్‌గా నిలవగా... ఆటో, బ్యాంకింగ్, ఫార్మా, రియల్టీ రంగాలు కూడా లాభాలను ఆర్జించాయి. అయితే ఐటీ, మీడియా షేర్లు మాత్రం నష్టాలను చవిచూశాయి. సెన్సెక్స్‌లో ఏషియన్ పెయింట్స్, మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్, ఐటీసీ, హిందుస్థాన్ యూనిలీవర్, ఐసీఐసీఐ బ్యాంక్ వంటివి ప్రధానంగా లాభపడ్డాయి. పెద్ద కంపెనీల షేర్లలో కొనుగోళ్ల జోరు కనిపించినప్పటికీ, బ్రాడర్ మార్కెట్‌లో మిశ్రమ స్పందన వ్యక్తమైంది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.57 శాతం క్షీణించగా, స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.05 శాతం స్వల్పంగా నష్టపోయింది. సాంకేతికంగా నిఫ్టీ మరింత బలపడే అవకాశం ఉందని, "ధర తగ్గినప్పుడు కొనుగోలు చేసే వ్యూహం" మంచి ఫలితాలనిస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు, పసిడి కూడా తన పరుగును కొనసాగించింది. అమెరికాలో ప్రభుత్వ షట్‌డౌన్, డాలర్ ఇండెక్స్ బలహీనపడటంతో సురక్షిత పెట్టుబడిగా బంగారానికి డిమాండ్ పెరిగింది. ఫలితంగా, బంగారం ధర రూ. 1,700 (1.30 శాతం) పెరిగి రూ. 1,31,500కు చేరింది.

## అర్థం చేసుకోలేకపోతే ఎలా?

**నారాయణమూర్తి దంపతులపై కర్ణాటక సీఎం అసహనం**

బెంగళూరు: కర్ణాటకలో కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక సర్వేను నారాయణమూర్తి దంపతులు అర్థం చేసుకోలేకపోతే తానేమీ చేయలేనని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న సర్వేపై ఆ దంపతులకు కొన్ని అపోహలున్నాయని, ఇది వెనుకబడిన వర్గాల సర్వే అనే అభిప్రాయంతో వారు ఉన్నారని ఆయన వ్యాఖ్యానించారు. కర్ణాటకలో జరుగుతున్న సామాజిక, ఆర్థిక సర్వేను ఇన్ఫోసిస్ నారాయణమూర్తి దంపతులు తిరస్కరిస్తూ, తమది వెనుకబడిన వర్గాలకు చెందిన కుటుంబం కాదని, ఈ సమీక్షలో పాల్గొనడం వల్ల కమిషన్‌కు లేదా ప్రభుత్వానికి ఎలాంటి ప్రయోజనం చేకూరదని అన్నారు. దీనిపై సిద్ధరామయ్య స్పందించారు. ఇన్ఫోసిస్ నారాయణమూర్తి దంపతులు భావిస్తున్నట్లుగా ఇది వెనుకబడిన తరగతుల సర్వే కాదని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. ఇది ఏడు కోట్ల జనాభా సర్వే అని ఇప్పటికి ఇరవై సార్లు చెప్పామని అన్నారు.

లావణ్య చిత్రం



అహానా కుమ్రా



## ఉస్తాద్ టార్గెట్ ఫిక్స్

పవన్ ఫ్యాన్స్ చూపు ఇప్పుడు ఉస్తాద్ భగత్‌సింగ్‌పైకి మళ్లింది. హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై కూడా మంచి అంచనాలే ఉన్నాయి. ఉస్తాద్ భగత్ సింగ్ కూడా కమర్షియల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతుంది. పైగా పవన్ కళ్యాణ్- హరీష్ శంకర్‌ది బ్లాక్ బస్టర్ కాంబినేషన్. వీరిద్దరి కలయికలో గతంలో గబ్బర్ సింగ్ అనే సినిమా రాగా, ఆ మూవీ ఇండస్ట్రీ హిట్ గా నిలిచిన సంగతి తెలిసిందే. అందుకే వీరి కాంబోలో వస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్‌పై మంచి క్రేజ్ నెలకొంది. ఇదిలా ఉ ంటే ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించి ఇప్పుడో అప్డేట్ వినిపిస్తోంది. ఉస్తాద్ భగత్ సింగ్ షూటింగ్ ఇప్పటికే 75% పూర్తైందని తెలుస్తోంది. ఆల్రెడీ పవన్ పోర్షన్ షూటింగ్ కంప్లీట్ కాగా, బ్యాలెన్స్ షూటింగ్ ను మిగిలిన ఆర్టిస్టులతో ఫినిష్ చేస్తున్నారు. అయితే ఉస్తాద్ భగత్ సింగ్ మొత్తం షూటింగ్ ను నవంబర్ నాటికి పూర్తి చేయాలని హరీష్ టార్గెట్ గా పెట్టుకున్నారట. అందులో భాగంగానే ఇక షూటింగ్ ను పరుగులు పెట్టించాలని డిసైడయ్యారట హరీష్. ఎలాగూ పవన్ పోర్షన్ షూటింగ్ అయిపోయింది కాబట్టి అనుకున్న టైమ్ కు షూటింగ్ పూర్తి చేసేయొచ్చు.

## నితిన్ మళ్లీ 'ఇష్క్' మోడ్‌లోకి?



ఒక సక్సెస్ ఎంత కిక్ ఇస్తుందో, ఒక ఫెయిల్యూర్ అంతకంటే పెద్ద పాఠాన్ని నేర్పుతుంది. యంగ్ హీరో నితిన్‌కు ఇప్పుడు సరిగ్గా అదే ఎదురవుతోంది. 'రాబిన్‌హుడ్', 'తమ్ముడు' చిత్రాలపై ఎన్నో ఆశలు పెట్టుకుంటే, ఆ రెండు సినిమాలు బాక్సాఫీస్ వద్ద దారుణంగా నిరాశపరిచాయి. ఈ బ్యాక్ టు బ్యాక్ డిజాస్టర్లతో నితిన్ ఇప్పుడు తన కెరీర్‌ను పునసమీక్షించుకునే పనిలో పడ్డాడు. ప్రతీ అడుగును ఆచితూచి వేస్తూ, తన నెక్స్ట్ ప్రాజెక్ట్‌పై పూర్తిస్థాయి కసరత్తు చేస్తున్నాడు. ఈ పునరాలోచనలో భాగంగా, నితిన్ కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకున్నాడు. ప్రస్తుతం నితిన్ కొత్త దర్శకులు, సరికొత్త కథల వైపు చూస్తున్నాడు. 'లిటిల్ హార్ట్స్'తో సెన్సేషన్ క్రియేట్ చేసిన సాయి మార్తాండ్‌తో ఒక ఫ్రెష్ లవ్ స్టోరీ కోసం చర్చలు జరుపుతున్నాడని టాక్ వచ్చింది. ఇది నితిన్‌కు బాగా కలిసొచ్చిన జానర్. తన కెరీర్‌ను ఎన్నోసార్లు నిలబెట్టింది ప్రేమకథలే. అందుకే, మళ్ళీ ఆ సేఫ్ గేమ్‌తో ట్రాక్‌లోకి రావాలని ఆలోచిస్తున్నాడేమో అనిపిస్తోంది. అయితే, లేటెస్ట్‌గా మరో టాక్ కూడా వినిపిస్తోంది. 'ఎక్కడికి పోతావు చిన్నవాడా', 'ఒక్క క్షణం' లాంటి థ్రిల్లర్లతో తనకంటూ ఒక బ్రాండ్ క్రియేట్ చేసుకున్న దర్శకుడు ఆనంద్‌తో నితిన్ కథా చర్చల్లో ఉన్నాడనేది హాట్ టాపిక్. ఇది నితిన్ కేవలం సేఫ్ గేమ్ ఆడాలనుకోవడం లేదని, ఆడియన్స్‌ను థ్రిల్ చేసే ఒక కొత్త కాన్సెప్ట్‌తో రావడానికి సిద్ధంగా ఉన్నాడని సూచిస్తోంది. ఈ మొత్తం పరిణామాన్ని చూస్తుంటే, పదేళ్ల క్రితం నాటి 'ఇష్క్' సమయం గుర్తుకొస్తోంది. అప్పుడు కూడా వరుస ఫ్లాపులతో కెరీర్ డైలమాలో ఉన్నప్పుడు, ఒక ఫ్రెష్, అర్బన్ లవ్ స్టోరీతో నితిన్ కెరీర్ గ్రాఫ్‌నే మార్చేశాడు.

MYTHRI MOVIE MAKERS

## నాలుగు సినిమాలకు 1000 కోట్లు

### మైత్రి మువీ మేకర్స్ సంచలనాలు

టాలీవుడ్ బడా ప్రొడక్షన్ హౌస్ మైత్రి మూవీ మేకర్స్ గురించి అందరికీ తెలిసిందే. నవీన్ యెర్నేని, వై. రవి శంకర్ స్టార్ట్ చేసిన ఆ సంస్థ.. సూపర్ స్టార్ మహేష్ బాబు శ్రీమంతుడు మూవీతో సినీ రంగంలోకి ఎంట్రీ ఇచ్చింది. డెబ్యూ మూవీతోనే బ్లాక్ బస్టర్ హిట్ అందుకుని సత్తా చాటింది. తొలి సినిమాతో మంచి లాభాలను సాధించింది. అలా పదేళ్ల క్రితం టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన మైత్రి సంస్థ.. అంచెలంచెలుగా ఎదిగింది. ఇప్పటివరకు బాక్సాఫీస్ వద్ద ఎన్నో బ్లాక్ బస్టర్ హిట్స్ ను అందుకుంది. తెలుగుతోపాటు మలయాళం, తమిళ సినీ ఇండస్ట్రీల్లోకి ఇప్పటికే అడుగుపెట్టింది. రెండేళ్ల నుంచి సినిమాలను డిస్ట్రిబ్యూట్ చేసి బాధ్యతలు కూడా తీసుకుంది. అనేక సినిమాలను పంపిణీ చేసింది. మొత్తానికి మైత్రి సంస్థ.. అటు సినిమాలు డిస్ట్రిబ్యూట్ చేస్తూ.. ఇటు అనేక చిత్రాలు నిర్మిస్తూ ఫుల్ బిజీగా గడుపుతోంది. అయితే వచ్చే ఏడాది నాలుగు బడా హీరోల సినిమాలను రిలీజ్ చేసేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే వాటి షూటింగ్స్ ను శరవేగంగా జరుపుతోంది. మరికొద్ది రోజుల్లో గుమ్మడికాయ కొట్టేందుకు కూడా రెడీ అవుతోంది. మైత్రి 2026 లైనప్ లో ఉన్న నాలుగు సినిమాలు 1.పెద్ది, 2.ఉస్తాద్ భగత్ సింగ్, 3.ఫౌజీ, 4.డ్రాగన్. అయితే ఆ నాలుగు సినిమాలకు మైత్రి సంస్థ రూ.1000 కోట్లకు పైగా వెచ్చిస్తున్నట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. స్టార్ హీరో రామ్ చరణ్, ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సనా కాంబినేషన్ లో తెరకెక్కుతున్న పెద్ది మూవీ.. వచ్చే ఏడాది మార్చి 27వ తేదీన రిలీజ్ కానుంది. రూ.350 కోట్ల బడ్జెట్ తో రూపొందుతుందని వినికిడి. ఇప్పటికే షూటింగ్ జెట్ స్పీడ్ లో జరుగుతోంది. ఆ తర్వాత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, హరీష్ శంకర్ కాంబోలో తెరకెక్కుతున్న ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాను మైత్రి విడుదల చేయనుంది. ఆ సినిమాను రూ.150 కోట్లతో నిర్మిస్తుందని సమాచారం. ఇప్పటికే షూటింగ్ చివరి దశలో ఉండగా.. త్వరలో రిలీజ్ తేదీని ఖరారు చేయనుంది. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, హను రాఘవపూడి కాంబినేషన్ లో తెరకెక్కుతున్న ఫౌజీ మూవీ కూడా 2026లోనే రిలీజ్ కానుంది. ఆగస్టు 14వ తేదీన విడుదల అవ్వనుందని వినికిడి. ఇప్పటికే ఆ సినిమా షూటింగ్.. శరవేగంగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. రూ.350 కోట్ల భారీ బడ్జెట్ తో ఫౌజీని మైత్రి సంస్థ రూపొందిస్తుందని అంచనా. ఆ మూడింటితోపాటు స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబినేషన్ లో రూపొందుతున్న డ్రాగన్ చిత్రం కూడా వచ్చే ఏడాది విడుదల కానుంది. ఆ సినిమా రూ.350 కోట్ల బడ్జెట్ తో తెరకెక్కుతుందని అంచనా. అలా రామ్ చరణ్, పవన్ కళ్యాణ్, ప్రభాస్, తారక్ చిత్రాలను మైత్రి సంస్థ.. రూ.1000 కోట్లకు పైగా వ్యయంతో రూపొందిస్తుందని సమాచారం.



## ఎల్లమ్మ హీరో.. డీఎస్పీ

బలగం తర్వాత వేణు ఎల్లమ్మ అంటూ ఒక ప్రాజెక్ట్ అనౌన్స్ చేశాడు. దిల్ రాజు నిర్మించబోతున్న ఈ సినిమాలో టైటిల్ రోల్ లో కీర్తి సురేష్ నటిస్తుందని తెలుస్తుంది. ఐతే ఎల్లమ్మ సినిమాలో కథానాయకుడి పాత్రలో నటించేది ఎవరన్నది సస్పెన్స్ కొనసాగుతుంది. ఆ సినిమాలో ఫలానా హీరో అంటూ రకరకాల పేర్లు వినిపించాయి. ముందు ఎల్లమ్మ సినిమాకు నానిని హీరోగా తీసుకోవాలని అనుకున్నాడు డైరెక్టర్ వేణు. ఆల్రెడీ నాని వరుస సినిమాలతో బిజీగా ఉండటం వల్ల ఆ సినిమా కాదనాల్సి వచ్చింది. ఎల్లమ్మలో నితిన్ హీరోగా కన్ ఫర్మ్ అనుకున్నారు. సినిమా సెట్స్ మీదకు వెళ్లడమే తరువాయి అనుకున్న టైం లో తమ్ముడు సినిమా ఇచ్చిన షాక్ తో నితిన్ కూడా ఆ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. నితిన్ తోనే తమ్ముడు అని ఫిక్స్ అయిన ఆడియన్స్ కి హీరో మార్పులంటూ వచ్చిన వార్తలు షాక్ అయ్యేలా చేశాయి. ఇక శర్వానంద్ తో పాటు తమిళ హీరో పేరు కూడా ఎల్లమ్మకి జత చేస్తూ వార్తలు వచ్చాయి. ఎల్లమ్మ కథను వేణు ఎంతో కష్టపడి అద్భుతంగా రాసుకున్నారు. ఐతే కథ రాసింది వేణునే అయినా ఈ సినిమాలో ఎవరు నటించాలన్నది మాత్రం అమ్మ వారే ఎంపిక చేసుకుంటారన్నట్టు ఎవరెవరి పేర్లో వినిపించగా ఫైనల్ గా దేవి శ్రీ ప్రసాద్ తెరంగేట్రం సినిమాగా ఇది వస్తుంది. ఎల్లమ్మ ఇది అమ్మ వారి స్క్రిప్ట్ లో భాగమే అంటూ సోషల్ మీడియాలో డిస్కషన్స్ జరుగుతున్నాయి. సినిమా అంటే అంతే.. ఒక హీరో కోసం కథ సిద్ధం చేస్తే అది మరో హీరో దగ్గరకు వెళ్తుంది. ఐతే అది రెగ్యులర్ సినిమా అయితే ఆ హీరో బ్యాడ్ లక్ అనేస్తాం. కానీ ఇది అమ్మ వారి కథ కాబట్టి ఇలా అమ్మోరే తన సినిమాకు కావాల్సిన కాస్టింగ్ ఎంపిక క్లియర్ చేస్తుందని అంటున్నారు. బలగం హిట్ ఇచ్చాడు కాబట్టి ఎల్లమ్మ సినిమా విషయంలో వేణుకి ఫ్రీ హ్యాండ్ ఇస్తున్నాడు దిల్ రాజు. త్వరలోనే ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్లబోతుంది. సినిమా గురించి దాదాపు ఏడాది కాలంగా డిస్కషన్స్ జరుగుతున్నాయి. మరి వేణు ఎల్లమ్మ సినిమా ఎలాంటి డివోషనల్ వైబ్ కలిగిస్తుంది అన్నది చూడాలి. ఎల్లమ్మ కోసం మేకర్స్ సెపరేట్ సెట్ వర్క్ చేస్తున్నారట. సినిమా పీరియాడికల్ మూవీగా ఉంటుందని తెలుస్తుంది. సో దేవి శ్రీ ప్రసాద్ ఇన్నేళ్ల సినీ కెరీర్ లో మ్యూజిక్ డైరెక్టర్ గా చేస్తూ అదరగొట్టాడు.. సో హీరోగా అతని తొలి ప్రయత్నం అది కూడా దేవత కథ ఎలాంటి టర్న్ ఇస్తుందో చూడాలి. దేవి సినిమాతో దేవి శ్రీ ప్రసాద్ గా మారిన డి.ఎస్.పీ మళ్లీ ఎల్లమ్మ కథతో కెరీర్ లో కొత్త టర్న్ తీసుకుంటున్నాడు.



## కృతి శెట్టి బాలీవుడ్ ఎంట్రీ లేనట్లే?

యంగ్ బ్యూటీ కృతి శెట్టి.. బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇస్తుందని ఇటీవల వార్తలు వచ్చాయి. డెబ్యూ మూవీ ఫిక్స్ కూడా అయినట్లు టాక్ వినిపించింది. బీ టౌన్ ప్రముఖ నటుడు గోవింద కుమారుడు యశ్వర్ధన్ అహూజా డెబ్యూ మూవీతోనే కృతి శెట్టి బాలీవుడ్ డెబ్యూ ఇవ్వనుందని వార్తలు వచ్చాయి. డబుల్ డెబ్యూ ప్రాజెక్ట్ గా రూపొందుతున్న ఆ సినిమాకు సాజిద్ ఖాన్ దర్శకత్వం వహిస్తున్నారని తెలిసింది. ప్రముఖ బాలీవుడ్ నిర్మాణ సంస్థ జీ స్టూడియోస్ నిర్మిస్తుందని ప్రచారం జరిగింది. అంతే కాదు ఆ సినిమా సౌత్ సినీ ఇండస్ట్రీలో సూపర్ హిట్ అయిన ఓ చిత్రానికి రీమేక్ గా తెరకెక్కనుందని టాక్ వినిపించింది. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు జరుగుతున్నాయని, త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని కూడా వార్తలు వచ్చాయి. అయితే ఇప్పుడు ఆ ప్రాజెక్టు నుంచి హీరోయిన్ గా కృతి శెట్టి తప్పుకున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆ విషయం హాట్ టాపిక్ గా మారింది. నిజానికి.. టాలీవుడ్ బ్లాక్ బస్టర్ మూవీ బేబీని బాలీవుడ్ లో రీమేక్ చేసేందుకు హీరోయిన్ గా కృతి శెట్టిని అప్పట్లో ఫిక్స్ చేశారు. కానీ కొన్ని కారణాల వల్ల ఆ ప్రాజెక్టు ఆగిపోయింది. ఇప్పుడు యశ్వర్ధన్ అహూజా సరసన నటిస్తుందని వార్తలు రాగా.. ఆమెనే తప్పుకుంది.


## కింగ్ 100లో స్వీటీ?

తమిళ దర్శకుడు ఆర్ కార్తీక్‌తో నాగార్జున సినిమా చేయబోతున్నాడని ప్రచారం సాగుతోంది. ఇది నాగార్జునకు 100వ సినిమా కానుంది. ఈ మైల్ స్టోన్ మూవీని నాగ్ చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుని చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో అఖిల్, నాగ చైతన్య ముఖ్యమైన గెస్ట్ రోల్స్ చేస్తున్నారనే వార్తలు వస్తున్నాయి. ఇప్పటి వరకు ఆ విషయం గురించి అధికారికంగా ఎలాంటి ప్రకటన రాలేదు. ఇక ఈ సినిమాలో హీరోయిన్స్ గురించి మొదటి నుంచి పుకార్లు షికార్లు చేస్తూనే ఉన్నాయి. తాజాగా మరో ఆసక్తికర పుకారు ఒకటి హీరోయిన్ గురించి రావడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. నాగార్జున ఇప్పటికే ఈ 100వ సినిమా షూటింగ్‌లో జాయిన్ అయ్యాడు. అధికారికంగా ప్రకటన వచ్చేది ఎప్పుడు అని అక్కినేని ఫ్యాన్స్ ఎదురు చూస్తున్న ఈ సినిమా షూటింగ్ లో ఇటీవలే టబు సైతం జాయిన్ అయిందని వార్తలు వస్తున్నాయి. ఇప్పుడు మరో హీరోయిన్‌గా అనుష్క ఈ సినిమాలో నటించబోతుంది అనే వార్తలు వస్తున్నాయి. సినిమాలో నాగార్జున డ్యూయల్ రోల్ అనే పుకార్లు షికార్లు చేస్తున్నాయి. అదే నిజం అయితే రెండో హీరోయిన్‌గా అనుష్క నటించడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.



# స్టార్ క్రికెటర్ సతీమణికి మంత్రి పదవి

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా సతీమణి రివాబా జడేజాకు మంత్రి పదవి దక్కింది. 26 మందితో కూడిన కొంత మంత్రి వర్గాన్ని గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ శుక్రవారం ప్రకటించారు. రవీంద్ర జడేజా సతీమణి రివాబా జడేకు తొలిసారి మంత్రి పదవి దక్కింది. గురువారం సీఎం మినహా మంత్రులంతా రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. పాత క్యాబినేట్‌లో ఆరుగురు మాత్రమే తమ పదవులను నిలబెట్టుకున్నారు. హెూమ్ మినిస్టర్ హర్ష్ సంఘవి డిప్యూటీ సీఎంగా నియమితులయ్యారు. కొత్త కాబినేట్‌లో 20 మందికి కొత్తగా అవకాశం దక్కింది. కొత్త మంత్రులు ఈ రోజు ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంది. 2019 మార్చిలో బీజేపీలో చేరిన రివాబా జడేజా.. 2022 గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో జామ్‌నగర్ నార్త్ నియోజక వర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైంది. తన ప్రత్యర్థి బిపేంద్రసిన్హ్ జడేజా(కాంగ్రెస్)పై 15వేల ఓట్ల మెజార్టీతో రివాబా జడేజా విజయం సాధించింది. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. రివాబా జడేజాకు వ్యతిరేకంగా రవీంద్ర జడేజా సోదరి నైనబా జడేజా, తండ్రి అనిరుద్ధ్ సిన్హ్ జడేజా ప్రచారం చేశారు. కానీ మామ, ఆడబిడ్డపై రివాబా జడేజానే పై చేయి సాదించింది. రవీంద్ర జడేజా కుటుంబం ఎన్నో తరాలుగా కాంగ్రెస్ పార్టీకి మద్ధతుదారులుగా ఉన్నారు. జామ్‌నగర్ నార్త్ నియోజకవర్గం నుంచి జడేజా సోదరి నైనబా జడేజా టికెట్ ఆశించింది. కానీ ఆమెకు టికెట్ దక్కలేదు. టీమిండియాకు దూరంగా ఉండి మరి జడేజా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాడు. సతీమణి గెలుపులో కీలక పాత్ర పోషించాడు. ఇక 1990లో జన్మంచిన రివాబా జడేజా.. మెకానికల్ ఇంజనీరింగ్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసారు. ఆమె తండ్రి వ్యాపారవేత్త కాగా.. కాంగ్రెస్‌కు చెందిన హరి సింగ్ సోలంకి మేనకోడలు. 2016లో రవీంద్ర జడేజాను పెళ్లిచేసుకున్న రివాబా జడేజా.. 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు బీజేపీలో చేరారు. ఎన్నికల అఫిడవిట్‌లో ఆమె ఆస్తుల విలువ రూ.97 కోట్లుగా పేర్కొన్నారు. టీ20 ప్రపంచకప్ 2024 విజయానంతరం పొట్టి ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన జడేజా.. వన్డే, టెస్ట్‌ల్లో మాత్రమే కొనసాగుతున్నాడు. ఇటీవల ముగిసిన న్యూజిలాండ్‌తో టెస్ట్ సిరీస్‌లో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు. ఇంగ్లండ్ పర్యటనలోనూ మెరుగైన ప్రదర్శన చేశాడు.






## తిలక్ వర్మకు చిరు సన్మానం

టాలీవుడ్ టాప్ హీరో, మెగాస్టార్ చిరంజీవిని టీమిండియా స్టార్ బ్యాటర్, తెలుగు తేజం తిలక్ వర్మ కలిసాడు. మెగాస్టార్ అప్‌కమింగ్ మూవీ 'మన శంకర వర ప్రసాద్ గారు' షూటింగ్ సెట్స్‌లో చిరంజీవితో సమావేశమయ్యాడు. ఈ సందర్భంగా తిలక్ వర్మను చిరంజీవి సన్మానించాడు. ఆసియా కప్ 2025లో అసాధారణ ప్రదర్శనతో టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించిన తిలక్ వర్మను చిరంజీవి ప్రత్యేకంగా అభినందించాడు. బిజీ షెడ్యూల్ మధ్య కూడా సమయం కేటాయించి టీమిండియా ఛాంపియన్‌ను చిరు ఆహ్వానించాడు. శాలువాతో సన్మానించడంతో పాటు పాకిస్థాన్‌తో ఫైనల్లో భారత్‌ను గెలిపించిన అనంతరం తిలక్ వర్మ చేసిన విజయనాదానికి సంబంధించిన ఫ్రేమ్‌ను బహుమతిగా అందించాడు. ఈ సన్మాన కార్యక్రమంలో మెగా స్టార్‌తో పాటు ఈ సినిమా హీరోయిన్ నయనతార, డైరెక్టర్ అనిల్ రావిపూడి, నిర్మాతలు సాహు గారపాటి, సుస్మిత కొణిదెల పాల్గొన్నారు. తన ఫేవరేట్ హీరో ద్వారా సన్మానం అందుకోవడం చిరస్మరణీయ క్షణమని ఈ సందర్భంగా తిలక్ వర్మ చెప్పుకొచ్చాడు.

## టెస్ట్-ట్వంటీ.. కొత్త ఫార్మాట్

క్రికెట్‌లో టెస్ట్, వన్డే, టీ20 ఫార్మాట్‌లు అధికారికంగా అభిమానులను అలరిస్తుంటే.. హండ్రెడ్ బాల్, టీ10, బ్యాక్‌యార్డ్/స్ట్రీట్ క్రికెట్, డబుల్ వికెట్ ఫార్మాట్‌లు అనధికారికంగా చలామణి అవుతున్నాయి. తాజాగా మరో క్రికెట్ ఫార్మాట్ పురుడు పోసుకునేందుకు సిద్ధమైంది. సుదీర్ఘ ఫార్మాట్‌కు మరింత ఆదరణ పెంచే యోచనలో భాగంగా ఈ సరికొత్త ఫార్మాట్‌ను రూపొందించారు. టెస్ట్ మ్యాచ్‌ను టీ20 తరహాలో ఆడిస్తే ఎలా అనే ఆలోచనలో నుంచి పుట్టిందే ఈ సరికొత్త ఫార్మాట్. సాధారణంగా రెడ్ బాల్ క్రికెట్‌లో నాలుగు ఇన్నింగ్స్‌లను ఐదో రోజుల పాటు ఆడుతారు. అయితే ఈ సరికొత్త ఫార్మాట్‌లో 80 ఓవర్లను నాలుగు ఇన్నింగ్స్‌లుగా విభజించి టీ20 ఫార్మాట్ తరహాలో ఆడించనున్నారు. ఇరు జట్లు రెండు సార్లు బ్యాటింగ్ చేయడంతో పాటు బౌలింగ్ చేయాల్సి ఉంటుంది. ఈ ఫార్మాట్‌కు టెస్ట్-ట్వంటీ అని నామకరణం చేశారు. ఈ నయా ఫార్మాట్‌ను గురువారం ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ మాథ్యూ హెడెన్, భారత మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్, సౌతాఫ్రికా దిగ్గజం ఏబీ డివిలియర్స్‌తో పాటు దిగ్గజ క్రికెటర్ సర్ క్లైవ్ లాయిడ్ ఆవిష్కరించారు. ఈ ఫార్మాట్ సరికొత్తగా ఉంటుందని, ఈ ఛాంపియన్‌షిప్ తొలి రెండు ఎడిషన్స్ భారత్‌లోనే జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. తొలి ఎడిషన్ జనవరి 2026లో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. క్రికెట్‌ను మతంలా భావించే భారత్‌లోనే ఈ సరికొత్త ఫార్మాట్‌ను ప్రవేశపెట్టడం సరైందిగా తాము భావించామని ఈ ఛాంపియన్‌షిప్ నిర్వాహకుడు గౌరవ్ బహీర్వాణి తెలిపారు.




## రో-కో షోకు సిద్ధం కండి: బీసీసీఐ

రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ.. ఆ ఇద్దరు మేటి బ్యాటర్లు అంతర్జాతీయ క్రికెట్ ఆడి ఏడు నెలలు అవుతోంది. ఐపీఎల్ ఆడి అయిదు నెలలు అవుతోంది. ఇప్పుడు ఆ స్టార్స్ ఇద్దరూ మళ్లీ గ్రౌండ్‌లోకి దిగుతున్నారు. ఆస్ట్రేలియాతో పెర్త్‌లో జరిగే తొలి వన్డే కోసం ఫుల్ ప్రిపేరయ్యారు. తమకు ఇష్టమైన వన్డే ఫార్మాట్‌లో చెలరేగేందుకు నెట్స్‌లో జోరుగా ప్రాక్టీస్ చేస్తున్నారు. క్రికెట్ ప్రేమికులను మళ్లీ కనువిందు చేసేందుకు ఆ ఇద్దరూ ప్రాక్టీస్ చేస్తున్న విజువల్స్‌ను బీసీసీఐ తన సోషల్ మీడియాలో పోస్టు చేసింది. బ్యాక్ ఇన్ బ్లూస్ అంటూ క్యాప్షన్ ఇచ్చింది. కోహ్లీ సుమారు 40 నిమిషాల పాటు నెట్స్‌లో గడిపాడు. రాణా, అర్షదీప్‌తో పాటు లోకల్ బౌలర్లను ఎదుర్కొన్నాడు. టీమ్‌మేట్ రోహిత్ కూడా నెట్స్‌లో తీవ్రంగా బ్యాటింగ్ ప్రాక్టీస్ చేవాడు. కోహ్లీ ఆడుతుంటే బంతి సౌండ్ మారుమోగింది. కానీ టైమింగ్ కోసం రోహిత్ కష్టపడినట్లు తెలుస్తోంది. చాలాసేపటి తర్వాత నెట్స్‌లోకి భారీ షాట్స్ కొట్టాడు రోహిత్. ఆదివారం రెండు జట్ల మధ్య తొలి వన్డే జరగనున్నది. ఆ మ్యాచ్‌లో రోకో పర్ఫార్మెన్స్ కోసం జనం ఎదురుచూస్తున్నారు. కోహ్లీ, రోహిత్ ఇద్దరు కలిసి సుమారు 600 వన్డేలు ఆడారు. ఈ సిరీస్‌తో వన్డే క్రికెట్‌కు ఆ ఇద్దరు స్టార్స్ వీడ్కోలు పలుకుతారేమో అన్న అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. ఇది ఫేర్‌వెల్ సిరీస్ అని కొందరంటున్నారు.

## చాముండేశ్వరనాథ్‌కు బీసీసీఐ కీలక పదవి

భారత క్రికెట్ నియంత్ర మండలి(బీసీసీఐ) అపెక్స్ కౌన్సిల్ సభ్యుడిగా మాజీ రంజీ క్రికెటర్, తెలుగు తేజం వాకిన చాముండేశ్వరనాథ్ ఎన్నికయ్యారు. భారత క్రికెటర్ల అసోసియేషన్(ఐసీఏ) ప్రతినిధిగా ఎంపికవ్వడంతో ఆయనకు ఈ అవకాశం దక్కింది. బుధ, గురువారాల్లో జరిగిన ఐసీఏ ఈ-ఓటింగ్‌లో చాముండేశ్వరనాథ్‌కు రికార్డ్ స్థాయిలో మద్దతు లభించింది. చాముండేశ్వరనాథ్‌కు మొత్తం 755 ఓట్లు రాగా.. ఆయన ప్రత్యర్థి రాజేశ్ జడేజాకు 83 ఓట్లు మాత్రమే వచ్చాయి. మొత్తం 838 మంది క్రికెటర్లు ఓటింగ్‌లో పాల్గొన్నారు. బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్‌లో చాముండి ఐసీఏ ప్రతినిధిగా మూడేళ్లు



కొనసాగనున్నారు. మహిళా క్రికెటర్ల తరఫున సుధా షాకు ఈ అవకాశం దక్కింది. ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్‌లో ఐసీఏ ప్రతినిధిగా శుభాంగి దత్తాత్రేయ కులకర్ణి ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రికి చెందిన చాముండేశ్వరి నాథ్.. ఆంధ్ర జట్టు తరఫున ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడారు. 1978-92 మధ్య కాలలో మొత్తం 14 సీజన్ల పాటు దేశవాళీ క్రికెట్‌లో ఆంధ్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. 44 ఫస్ల్ క్లాస్ మ్యాచ్‌ల్లో 1818 పరుగులు చేశారు. ఇందులో 4 శతకాలతో పాటు 8 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఆంధ్ర జట్టుకు కెప్టెన్‌గా కూడా వ్యవహరించారు. ఆటగాడిగా వీడ్కోలు పలికిన అనంతరం ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ)తో పాటు బీసీసీఐ, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్‌లో పలు పదవులు చేపట్టాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2009లో భారత జట్టుకు మేనేజర్‌గా పని చేశారు. బీసీసీఐ జూనియర్ సెలెక్షన్ కమిటీ ఛైర్మన్‌గా, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌లో సెక్రటరీ, సెలెక్షన్ కమిటీ ఛైర్మన్, ఆంధ్ర అండర్ 19, మహిళల జట్ల సెలెక్టర్‌గా కూడా బాధ్యతలు చేపట్టారు. వ్యాపార వేత్త అయిన చాముండీ.. ఇండియన్ బ్యాడ్మింటన్ లీగ్‌లో ముంబై మాస్టర్స్ జట్టుకు కో ఓనర్‌గా ఉన్నారు. హైదరాబాద్ బ్యాడ్మింటన్ అసోసియేషన్‌తో పాటు తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌కు చాముండీ మంచి స్నేహితుడు. అంతర్జాతీయంగా సత్తా చాటే ఆటగాళ్లకు చాముండీ ఖరీదైన కార్లను బహుమతిగా అందిస్తూ వారిని మరింత ప్రోత్సహిస్తాడు.

## తొక్కిసలాట ఎఫెక్ట్.. అమ్మకానికి ఆర్సీబీ

ఐపీఎల్‌లో సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ 18వ సీజన్‌లో ట్రోఫీని ముద్దాడింది రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు. ఇక ఐపీఎల్‌లో ఆర్సీబీ శకం మొదలైందని అభిమానులు సంబురపడుతున్న వేళ.. ఫ్రాంచైజీని అమ్మేయాలని యాజమాన్యం భావిస్తోంది. మంచి ధర పలికితే ఏమాత్రం ఆలోచించకుండా బెంగళూరు జట్టును వదిలించుకోవాలని అనుకుంటోంది డియాగియో గ్రేట్ బ్రిటన్ సంస్థ. ఈ మద్యం కంపెనీకి చెందిన వాటాదారులు ఐపీఎల్‌లో జట్టును కొనసాగించేందుకు అయిష్టత చూపిస్తున్నారట. అందుకే.. ఆర్సీబీని అమ్మేయడమే మంచిదని సంస్థ ఆలోచిస్తోంది. అయితే.. చిన్నస్వామి తొక్కిసలాట, పోలీస్ కేసు తదనంతర పరిణామాల నేపథ్యంలో కొత్తవాళ్లకు జట్టును అప్పగించేందుకు ఆర్సీబీ యాజమాన్యం సిద్ధపడుతోంది. విరాట్ కోహ్లీవంటి స్టార్ ఆటగాడు ఉన్న ఆర్సీబీ మార్కెట్ విలువ భారీగానే ఉంది. 'ఐపీఎల్ విజేత' అనే ట్యాగూ ఉండడంతో రూ.1.75లక్ష కోట్లకు ఫ్రాంచైజీని అమ్మాలని డియాగియో గ్రేట్ బ్రిటన్ కంపెనీ పావులు కదుపుతోంది.




## రోహిత్ తక్కువేం కాదు ట్రావిస్ హెడ్

టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మపై తనకున్న అభిమానాన్ని ఆస్ట్రేలియా విధ్వంసకర ఓపెనర్ ట్రావిస్ హెడ్ చాటుకున్నాడు. వైట్‌బాల్ ఫార్మాట్‌లో రోహిత్ శర్మను చూసి తాను ఎంతో నేర్చుకున్నానని తెలిపాడు. రోహిత్ శర్మతో కలిసి ఆడే అవకాశం ఇప్పటి వరకు రాలేదని, ఏదో ఒక రోజు అతనితో డ్రెస్సింగ్ రూమ్ పంచుకుంటానని ఆశాభావం వ్యక్తం చేశాడు. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఆదివారం పెర్త్ వేదికగా జరిగే తొలి మ్యాచ్ నేపథ్యంలో ట్రావిస్ హెడ్ మీడియాతో మాట్లాడాడు. ఈ సందర్భంగా కోహ్లీ, రోహిత్ శర్మ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. కోహ్లీ కంటే రోహిత్ ఏ విషయంలోనూ తక్కువ కాదని స్పష్టం చేశాడు. ఆస్ట్రేలియా పర్యటనలోనే ఈ ఇద్దరూ వీడ్కోలు పలికే అవకాశం ఉందా? అని ప్రశ్నించగా.. వన్డే ప్రపంచకప్ 2027 వరకు ఆడుతారని ఆశిస్తున్నానని తెలిపాడు.

ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
శనివారం 18-10-2025 | www.evarthalu.com



ఆయుర్వేద విజ్ఞానానికి ధన్వంతరి ఆరాధ్య దైవం. క్షీరసాగర మథనం సమయంలో శ్రీమహా విష్ణువు అంశావతారంగా అమృత కలశహస్తుడై సమస్త ప్రజలకు రోగనివారణ ద్వారా ఆరోగ్యాన్ని ప్రసాదించడానికి ధన్వంతరి ఆవిర్భవించాడు. అలా ధన్వంతరి జన్మించిన ఆశ్వయుజ బహుళ త్రయోదశిని హిందువులు ధన త్రయోదశిగా జరుపుకుంటారు. ఆశ్వయుజ కృష్ణ త్రయోదశి నాడు సూర్యోదయానికి ముందే నదీ స్నానం కాని లేదా సముద్ర స్నానం కాని చేయాలి. గృహంలో కానీ, నదీ లేదా సముద్ర తీరాలలో కానీ, వైద్యశాలలో కానీ తూర్పు దిక్కుగా కలశ స్థాపన చేసి ధన్వంతరికి ఆవాహనం చేయాలి. ధన్వంతరిని ధ్యానించిన తర్వాత యధాశక్తి షోడశోపచార సహితంగా పురుషసూక్త విధానంతో అర్చన జరపాలి. మత్స్యపురాణాంతర్గతమైన స్తోత్రాన్ని పఠించి, గరుడ పురాణాంతర్గతమైన ధన్వంతరి సార్థవ్రత కథను పారాయణ చేయాలి. వ్రత సమాప్త్యానంతరం ఇతర వైద్యులకి, పెద్దలకి తాంబూలం సమర్పించి, ఘృతయుక్తమైన పెసర పులగం నివేదన చేసి భుజించాలి.

# ధన త్రయోదశి.. ఐశ్వర్యం, సంపద

ఇది 5 రోజుల దీపావళి పండుగలో మొదటి రోజు. ఈరోజున సంపదకు దేవత అయిన లక్ష్మీదేవిని, ఆరోగ్య ప్రదాత అయిన ధన్వంతరిని పూజిస్తారు. ఈ పండుగతోనే దీపావళి పండుగ ప్రారంభమవుతుంది. ఈరోజున బంగారం, వెండి, కొత్త చీపుర్లు, కొత్త పాత్రలు, కొత్త వస్తువులు చేయడం శుభమని భావిస్తారు. దుష్ట శక్తులు తొలగిపోతాయని నమ్మకం. అయితే.. ఈరోజున లక్ష్మీదేవి, పాల కడలి నుంచి ఉద్భవించిందని నమ్ముతారు. అందుకే లక్ష్మీదేవి పూజ చేస్తారు.

ధన్వంతరి కూడా ఇదే రోజు ఉద్భవించారని చెబుతారు. అలాగే.. మరణానికి అధిపతి అయిన యముడి అనుగ్రహం కోసం యమ దీపం వెలిగించి పూజిస్తారు. యమ ధర్మరాజు ఆశీర్వాదం కోరుతారు. ధన త్రయోదశి రోజున బంగారం, వెండి లేదా కొత్త వస్తువులు, వాహనాలు, ఆస్తులు వంటివి కొనుగోలు చేయడం శుభప్రదంగా భావిస్తారు. అంతే కాకుండా ఇంట్లో ఉన్న బంగారం, వెండి ఆభరణాలను లక్ష్మీదేవికి పూజ చేసే సమయంలో అమ్మవారి దగ్గర పెట్టి దీపం వెలిగించి పూజ చేస్తే అష్టైశ్వ ర్యాలు కలుగుతాయని ప్రగాఢ విశ్వాసం. అంతే కాకుండా ఆయుర్వే దానికి ఆద్యుడు, ఆరోగ్య ప్రదాత అయిన ధన్వంతరి కూడా క్షీరసాగర మథనం ద్వారా అమృత కలశంతో ఆవిర్భవించిన రోజు. కాబట్టి ఈరోజును ధనం, ఆరోగ్యానికి ప్రతీకగా భావిస్తారు. ఈ రోజున ప్రధానంగా ధన్వంతరి పూజ కూడా ఆచరిస్తారు.

**కొనాల్సినవి**

ఈ రోజు బంగారం, వెండి, రాగి పాత్రలు, ఆభరణాలు, ఆస్తులు కొనుగోలు చేయడం చాలా శుభప్రదంగా పండితులు చెబుతారు. అంతే కాకుండా ధన త్రయోదశి రోజున కొత్త పాత్రలు కొనుగోలు చేసి వాటిని లక్ష్మీదేవికి సమర్పిస్తారు. ఇలా చేయడం వల్ల ఇంట్లో ఆనందం, శ్రేయస్సు కలుగుతుందని నమ్ముతారు. ధన త్రయోదశి రోజున చీపుర, రాగిపాత్రలు, కొత్తిమీర, ధనియాలు, ఉప్పు వంటివి కొనడం కూడా శుభప్రదంగా పరిగణిస్తారు. వీటిని కొనడం వల్ల ఇంట్లో సిరి సంపదలకు లోటుండదని బలమైన నమ్మకం.



**కొనకూడనివి**

ధన త్రయోదశి రోజు గాజు పాత్రలు కొనకూడదట. గాజు రాహువుకు సంబంధించినదిగా భావిస్తారు. కాబట్టి ధన త్రయోదశి రోజు గాజు పాత్రలు కొనకూడదని చెబుతారు. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే.. జ్యోతిష్య శాస్త్రంలో అల్యూమినియం అనేది దురదృష్టానికి చిహ్నంగా పరిగణించబడుతుంది. అందువల్ల ఈ ధన త్రయోదశి రోజు అల్యూమినియం, పదునైన వస్తువులు, నలుపు రంగు వస్తువులు వంటివి కూడా కొనకూడదు అని భావిస్తారు.

**ముహూర్త విశేషాలు:**

ధన త్రయోదశి పూజ ముహూర్తం: శనివారం సాయంత్రం 7:16 నుంచి సాయంత్రం 8:20 వరకు

ప్రదోషకాలం: సాయంత్రం5:48 నుంచి 8:20 సాయంత్రం వరకు

వృషభ కాలం: సాయంత్రం7:16 నుంచి సాయంత్రం9:11 వరకు

త్రయోదశి తిథి ప్రారంభం: అక్టోబర్ 18, 2025న మధ్యాహ్నం 12:18

త్రయోదశి తిథి ముగింపు: అక్టోబర్ 19, 2025న మధ్యాహ్నం 1:51

-విద్యారాణి వూరడి



## యమ దీపం.. భయాల నుంచి ఉపశమనం

ధన త్రయోదశి తిథి ఎప్పుడంటే హిందూ క్యాలెండర్ ప్రకారం ఆశ్వయుజ మాసంలోని కృష్ణ పక్ష త్రయోదశి తిథి అక్టోబర్ 18న మధ్యాహ్నం 12:18 గంటలకు ప్రారంభమవుతుంది. అక్టోబర్ 19న మధ్యాహ్నం 1:51 గంటలకు ముగుస్తుంది. పండితులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్టోబర్ 18వ తేదీ శనివారం ధన త్రయోదశిని జరుపుకుంటారు. కాబట్టి అదే రోజు యమ దీపం వెలిగించాలి. దీపం వెలిగించడానికి దిశ యమ దీపాన్ని ఎల్లప్పుడూ దక్షిణం వైపు చూస్తూ వెలిగించాలి. దక్షిణ దిశను యమ ధర్మరాజు దిశగా పరిగణిస్తారు. ఈ దిశలో దీపం వెలిగించడం వల్ల యముడు సంతోషిస్తాడు. అన్ని భయాల నుంచి ఉపశమనం కలిగిస్తాడు.

**యమ దీపం వెలిగించే నియమాలు:**

- యమ దీపం నాలుగు వైపులా ఉండాలి.. నాలుగు వత్తులతో వెలిగించాలి.
- యమ దీపం వెలిగించేందుకు నువ్వుల నూనె లేదా ఆవ నూనెను ఉపయోగించాలి.
- దీపం వెలిగించిన తర్వాత.. దానిని ఇంటి బయట దక్షిణం వైపు పెట్టాలి
- దీపం వెలిగించేటప్పుడు కుటుంబ సభ్యులందరూ దీర్ఘాయుష్షుతో జీవించాలని..అన్ని కష్టాల నుంచి విముక్తి పొందాలని ప్రార్థించాలి.
- యమ దీపాన్ని ఇంటి బయట దక్షిణ దిశలో పెట్టాలి

– ఈ దీపాన్ని దానం చేయడం వల్ల ఇంట్లో ఎల్లప్పుడూ ఆనందం, శ్రేయస్సు ఉ

# విశ్వనాథ.. తొలి జ్ఞానపీఠం

## ........నేడు విశ్వనాథ సత్యనారాయణ వర్ధంతి



తెలుగువారికి తొలి జ్ఞానపీఠాన్ని అందించిన కవిసమ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణ. విశ్వనాథ వారి ఏ రచన అయినా సరే భారతీయ ఆత్మను, జీవుని వేదనను ప్రతిబింబించేదే. ప్రతీ అక్షరంలోను అసాధారణ ఊహాశక్తిని, అద్భుత రచనాశైలిని నింపి పాఠకుల హృదయాలలోకి పరుగులెత్తించగలిగిన శక్తి ఆయన సొంతం. తెలుగు సాహిత్య ప్రక్రియల్లో విశ్వనాథ వారు స్పృశించని ప్రక్రియలేదు. తన రచనల ద్వారా కులాతీత, మతాతీత విధానాలను ఎండగట్టారు. ఆధునిక తెలుగు రచయితల్లో ఆయన పేరు లేకుండా తెలుగు సాహిత్య చరిత్ర గురించి వివరించలేం.

విశ్వనాథ రచనల్లో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సినవి – ఆంధ్రపౌరుషము, రామాయణ కల్పవృక్షము, వేయిపడగలు, కిన్నెరసాని పాటలు, పురాణవైర గ్రంథమాల, కాశ్మీర చారిత్రిక నవలలు, విశ్వనాథ మధ్యాక్కఱలు, నన్నయ ప్రసన్నకథాకలితార్థయుక్తి వంటివి. తెలుగు తనమన్నా, తెలుగు భాష అన్నా విశ్వనాథకు ప్రత్యేక అభిమానం. ఆంధ్ర పౌరుషం, ఆంధ్రప్రశస్తి ఆయన మొదటి రచనలలోనివి. విశ్వనాథ రచనలలో అతని పాండిత్యమే కాక, రచనాశిల్పం, పాత్ర చిత్రణ, చారిత్రక అవగాహన అద్భుతంగా కనిపిస్తుంటాయి. ఆయన చేసిన "రామాయణ కల్పవృక్షము" అనే పుస్తక రచనకు గాను జ్ఞాన్ పీఠ్ అవార్డు అందుకున్నారు. విశ్వనాథ సత్యనారాయణ 1895 సెప్టెంబరు 10న కృష్ణా జిల్లాలోని నందమూరులో జన్మించారు. ఆయన తల్లి దండ్రులు పార్వతమ్మ, శోభనాద్రి సత్యనారాయణ. తన ప్రసంగాల ద్వారా ఏదైతే చెప్పేవారో అదే ఆచరించి చూపేవారు. ఆయన రాసిన "శ్రీమద్రామాయణ కల్పవృక్షం" రచనకు జ్ఞానపీఠ అవార్డు వచ్చింది.. ఆయన రాసిన వరలక్ష్మీ త్రిశతి అనే స్మృతికావ్యం పాఠకులను మరో లోకంలోకి విహరింపజేస్తుంది. చారిత్రక నవల చద్దెన్న సేనాని ఆయనకు ప్రతిష్ఠ తెచ్చింది. నన్నయ్య, నాచనసోమన, అల్లసాని పెద్దన, కాళిదాసుల కవితా ధోరణుల మీద ఆయన రాసిన విమర్శనాత్మక వ్యాసాలు ఆణిముత్యాలు. కొన్ని రచనలను రేడియో నాటికలుగా మలిచారు. ఆయన రచనలను ఇతర భాషల్లో కూడా అనువదించారు. ఆయన రేడియో కోసం నాటకాలు, ప్రసంగాలు రూపొందించారు. అమృత శర్మిష్ఠమ్, గుప్త పాశుపతమ్, అనే నాటకాలను, ఆశనిరాశకు అనే నాటికను, దేవీత్రిశతి, వంటి కావ్యాలను ఆయన సంస్కృత భాషలో రచించారు. వీరిరచనలన్నీ సంచలన రచనలే. సత్యనారాయణ చేపట్టని ప్రక్రియకాని, ప్రయోగం కానీ లేదు. ఆయన నవల, కథ , నాటిక, పాట, ఏదైనా తగిన పరిష్కారాన్ని అందించే విధంగా ఉండటం స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన పద్య రచన అపూర్వం. సంస్కృత నాటకాల్లో గుప్త పాశుపతం, అమృత శర్మిష తెలుగు నాటకాల్లో కనకరాజు, అనార్కలి ప్రసిద్ధమైనవి. ఆయన కొన్ని పత్రికలకు సంపాదకులుగా కూడా పని చేశారు. కొంతకాలం ఆయన ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీకి ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. కోల్‌కతా, ముంబై, ఢిల్లీ, మద్రాసు, బెంగుళూరు వంటి పట్టణాల్లో ఆయన పొందిన సత్కారాలు అపూర్వమైనవి. 1964లోఆంధ్ర విశ్వ కలా పరిషత్ విశ్వనాథ వారిని కళా ప్రపూర్ణ బిరుదుతో సత్కరించారు. భారత ప్రభుత్వం పద్మభూషణ్ బిరుదుతో గౌరవించింది. కవిగా పండితునిగా, నవలా రచయితగా, నాటక కర్తగా, విమర్శకుడుగా, గాయకుడిగా రాణించిన విశ్వనాథ వారు 1976 అక్టోబరు 18న తనువు చాలించారు.

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.